**PCW తెలుగు దినపత్రిక**
PCW News Broadcasting PVT Ltd
Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna
హైదరాబాద్ సంపుటి : 02 సంచిక - 144 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- గురువారం 22 మే 2025

## హయత్‌నగర్‌లో ఘోర రోడ్డు ప్రమాదం




## జూలైలో స్థానిక సంస్థల ఎన్నికలు!




# తుపాకులతో గర్జించిన ఛత్తీస్‌ఘడ్

- ☛మావోయిస్టులకు భారీ ఎదురుదెబ్బ
- ☛అగ్రనేత,పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు హతం
- ☛ధృవీకరించిన హోంమంత్రి అమిత్ షా
- ☛వచ్చే మార్చి కల్లా మావోయిస్టుల అంతం చేస్తాం
- ☛గణపతి తరవాత బాధ్యతలో చేపట్టిన నంబాల
- ☛కోటిన్నర రివార్డు ఉన్నట్లు పోలీస్ అధికారుల వెల్లడి





**బీజాపూర్,మే 21(పిసిడబ్ల్యూ న్యూస్):** ఛత్తీస్‌గఢ్ మరోసారి తుపాకీ మోతతో దద్దరిల్లింది. మావోయిస్తులకు భారీ దెబ్బ పడింది. ఎన్‌కౌంటర్‌లో అగ్రనేత సహా మొత్తం 27మంది హతమయ్యారు. ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణపూర్ జిల్లాలో జరిగిన ఎదురుకాల్పుల్లో మావోయిస్టు అగ్ర నేత నంబాల కేశవరావు (70) అలియాస్ బసవరాజు మృతి చెందారు. ఈ విషయాన్ని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ఎక్స్‌లో వెల్లడించారు. బుధవారం ఉదయం జరిగిన ఎన్‌కౌంటర్‌లో 27 మంది మావోయిస్టులు మృతి చెందారు. వారిలో నంబాల కేశవరావు ఉన్నట్లు పోలీసులు వివరాలు 2లో

## ట్రంప్ ఒత్తిడికి

- పాక్‌పై ప్రతీకారం తీర్చుకోవడంలో విఫలం
- రాజీవ్ వర్ధంతి కార్యక్రమంలో సిఎం రేవంత్

# తలొగ్గిన మోడీ



**హైదరాబాద్,మే 21(పిసిడబ్ల్యూ న్యూస్):** మోదీ ప్రభుత్వం ట్రంప్ ఒత్తిడికి లొంగిపోయిందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. పహల్గాం దాడి తర్వాత దేశం అంతా ముక్త కంఠంతో కేంద్ర ప్రభుత్వానికి అండగా నిలిచిందని.. కానీ పాకిస్తాన్ కు బుద్ధి చెప్పడంలో కేంద్రం ప్రభుత్వం విఫలమైందని అన్నారు. వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోకుండా మోదీ ప్రభుత్వం వెనకడుగు వేసిందని.. గొప్పల కోసం పార్టీ శ్రేణులను వీధుల్లో తిప్పుతున్నారని విమర్శించారు. బుధవారం రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా.. ఆయన విగ్రహానికి సీఎం రేవంత్ పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ దేశానికి వన్నె తెచ్చిన నేత రాజీవ్ గాంధీ అని ఈ సందర్భంగా కొనియాడారు. 18 ఏండ్లకే యువతకు ఓటు హక్కు కల్పించారని.. దేశంలో సాంకేతిక విప్లవాన్ని తీసుకొచ్చిన ఘనత రాజీవ్ గాంధీకి సొంతమని అన్నారు. 1971 పాకిస్తాన్ పై ఇందిరా గాంధీ యుద్ధం చేసి బలమైన గుణపాఠం చెప్పారని ఈ సందర్భంగా సీఎం గుర్తుచేశారు. పాక్ ను రెండు ముక్కలు చేసి శాస్వత గుణపాఠం చెప్పారని అన్నారు. భారత్ పై తీవ్ర వాద ముసుగులో దాడి జరిగితే ఇందిరాగాంధీ తెగువ గుర్తు చేసుకొస్తుందని అన్నారు. దాదాపు 54 ఏండ్ల తర్వాత కూడా ఉక్కు మహిళ తెగువను ప్రపంచం గుర్తు చేసుకుంటుందని అన్నారు. తీవ్రవాదంపై పోరాడటం ప్రతి భారతీయుడి కర్తవ్యమని ఈ సందర్భంగా సీఎం రేవంత్ అన్నారు. పహల్గాం ఉగ్రదాడి తర్వాత ఆపరేషన్ కేంద్రానికి అండగా నిలిచామని.. క్యాండిల్ ర్యాలీతో తెలంగాణలో కేంద్రానికి మద్ధతుగా ర్యాలీ చేశామని గుర్తు చేశారు. దేశ వ్యాప్తంగా కంగ్రెస్ తో పాటు ప్రజలందరూ అండగా ఉన్నప్పటికీ.. ట్రంప్ ఒత్తిడికి లొంగిపోయి వచ్చిన అవకాశాన్ని మోదీ ప్రభుత్వం వివరాలు 2లో

## కావాలనే కాళేశ్వరం

# విచారణ జాప్యం

- ☛ఇంకెంతకాలం విచారణ చేయిస్తారు
- ☛నోటీసులు అందాక స్పందిస్తా..వచారణకు హాజరవుతా...
- ☛మల్కాజిగిరి ఎంపి ఈటెల రాజేందర్ స్పష్టీకరణ



**హైదరాబాద్, 21(పిసిడబ్ల్యూ న్యూస్):**కాళేశ్వరం కమి షన్ ఎదుట విచారణను కాలయాపన చేస్తూ.. కేసును నీరు గారుస్తున్నారని మల్కాజ్‌గిరి ఎంపీ, బీజేపీ నేత ఈటల రాజేందర్ ఆరోపించారు. ఇంకెంతకాలం విచారిస్తారని అన్నారు. ఇదంతా కావాలనే చేస్తున్నట్లుగా ఉందని అన్నారు. ఇక తనకు నోటీసులపై స్పందిస్తూ విచారణకు వందశాతం హాజరవుతానని రాజేందర్ స్పష్టం చేశారు. అయితే ఇంత వరకు ఎలాంటి నోటీసులు తనకు అందలేదని ఆయన తెలిపారు. అయితే తనకు నోటీసులు పంపిన విషయం మీడియా ద్వారా తెలుసుకున్నానని చెప్పారు. తనకు నోటీసులు అందిన అనంతరం ఈ విషయాన్ని పార్టీలో చర్చించి.. అధిష్టానం నిర్ణయానికి అనుగుణంగా తాను ముందుకు వెళ్తానన్నారు. బుధవారం ఎంపీ ఈటల రాజేందర్ మీడియాతో మాట్లాడుతూ.. ప్రభుత్వం నీది.. నువ్వు ఎలాంటి విచారణ అయినా చేయి అంటూ సీఎం రేవంత్ రెడ్డికి ఆయన సవాల్ విసిరారు. గతంలో దేవరాయాంజాల్ భూముల విషయంలో కేసీఆర్ చేసిన తప్పే.. వివరాలు 2లో



## రాజీవ్‌గాంధీకి కాంగ్రెస్ నేతల నివాళి

- ☛ఎన్నో సంస్కరణలు ప్రవేశ పెట్టారన్న ఖర్గే
- ☛తండ్రితో జ్ఞాపకాలను నెమరు వేసుకున్న రాహుల్

**న్యూఢిల్లీ,మే 21(పిసిడబ్ల్యూ న్యూస్):** భారత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ నేడు 34వ వర్ధంతి సందర్భంగా ఆయనకు ఘనంగా నివాళి అర్పించారు. రాజీవ్ తనయుడు, లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీతోపాటు, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లికార్జునఖర్గేలు ఢిల్లీలోని వీర్ భూమి రాజీవ్ స్మారక స్తూపం వద్ద నివాళులర్పించారు. వీరితోపాటు కాంగ్రెస్ నేత సచిన్ పైలట్, ఇతర కాంగ్రెస్ నేతలు కూడా స్మారక వివరాలు 2లో

## రెండ్రోజుల పాటు

# తెలుగు రాష్ట్రాల్లో భారీ వర్షాలు

- ☛ఈదురు గాలులతో కూడా వానలు పడే ఛాన్స్
- ☛అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించిన వాతావరణశాఖ



**హైదరాబాద్,మే 21(పిసిడబ్ల్యూ న్యూస్):** తెలుగు రాష్ట్రాల్లో పలుచోట్ల భారీ వర్షాలు కురుస్తున్నాయి. రానున్న ఐదు రోజుల పాటు కూడా మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. కోస్తా పరిసర ప్రాంతాల్లో కొనసాగుతున్న ద్రోణి మరో 12 గంటల్లో అల్పపీడనంగా మారే అవకాశం ఉందని, 36 గంటల్లో అల్పపీడనం మరింత బలపడి వాయు గుండంగా మారే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని అంటున్నారు. రెండ్రోజులు భారీ వర్షాలు పడే అవకాశం ఉందని, మరో ఐదు రోజుల పాటు కూడా వివరాలు 2లో



మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు

# సునీతకు షాక్

- గాంధీభవన్‌లో ధర్నా చేసినందుకు నోటీసులు

## కాంగ్రెస్, బిజెపి

# కుమ్మక్కు రాజకీయాలు

☛కెసిఆర్‌కు నోటీసుల వెనక రెండు పార్టీల కుట్ర ☛ఎన్ని నోటీసులు ఇచ్చిన ధైర్యంగా ఎదుర్కొంటాం ☛కెసిఆర్‌కు నోటీసులపై కెటిఆర్ విమర్శలు



**నల్లగొండ,మే 21(పిసిడబ్ల్యూ న్యూస్):** నోటీసులు ఎన్ని ఇచ్చినా ధైర్యంగా ఎదుర్కొంటామని, బిఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్‌కు ఇచ్చిన నోటీసులపై బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ స్పందించారు. చట్టాలు, న్యాయ వ్యవస్థ పై తనకు నమ్మకం ఉందని, కాంగ్రెస్, బిజెపి ఆడుతున్న నాటకంలో భాగంగానే నోటీసులు ఇచ్చారని మండిపడ్డారు. ప్రజా సమస్యలు గాలి కొదిలి తమకు నోటీసులిస్తు న్నారని, దిక్కుతోచని పరిస్థితుల్లోనే కెసిఆర్‌కు నోటీసులు ఇచ్చారని కెటిఆర్ మండిపడ్డారు. ప్రజాపాలన వివరాలు 2లో

# నేషనల్ హెరాల్డ్ కేసులో విచారణ

- ☛సోనియా, రాహుల్ 142 కోట్లు లబ్ది పొందారు
- ☛ప్రత్యేక కోర్టులో ఇడి సంచలన ఆరోపణలు



**న్యూఢిల్లీ,మే 21(పిసిడబ్ల్యూ న్యూస్):** నేషనల్ హెరాల్డ్ కు సంబంధించిన మనీలాండరింగ్ కేసులో కాంగ్రెస్ అగ్రనాయకులు సోనియా గాంధీ, రాహుల్ గాంధీలు లబ్ది పొందారని పై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ సంచలన ఆరోపణ లు చేసింది. ఈ నేరంలో వారు రూ.142 కోట్లు లబ్ది పొందారని ఆరోపించింది. నేరపూరిత ఆర్జనతో మనీలాండరింగ్‌కు పాల్పడ్డారని, తర్వాత కూడా వారు అదే పంథాను కొనసాగించారని పేర్కొంది. బుధవారం దిల్లీ ప్రత్యేక కోర్టులో జరిగిన విచారణలో భాగంగా ఈడీ ఈ వాదనను వినిపించింది. ఈ కేసులో ఇప్పటికే ఛార్జిషీట్ దాఖలు చేసిన ఈడీ అందులో కాంగ్రెస్ అగ్రనే తలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ సహా పలువురి పేర్లను పేర్కొంది. వివరాలు 2లో

# ట్రంప్ ఒత్తిడికి తలొగ్గిన మోడీ

(మొదటి పేజీ తరువాయి)

సద్వినియోగం చేసుకోలేదని విమర్శించారు. పాకిస్తాన్ విషయంలో అమెరికాకు లొంగిపోయి వెనకడుగు వేసిన మోదీ.. గొప్పల కోసం పార్టీ శ్రేణులను వీధుల్లో తిప్పుతున్నారని మండిపడ్డారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వివక్షణ కోల్పోయి రాహుల్ గాంధీని విమర్శిస్తున్నారని మండిపడ్డారు. మొట్ట మొదట కేంద్రానికి అండగా నలిచింది తెలంణ ప్రభుత్వమని. క్యాండిల్ ర్యాలీ తీసి కేంద్రానికి, బలగాలకు అండగా నిలిచామని అన్నారు. ఆ రోజు తాము చేసిన దానికి అభినందించడానికి నోరు కూడా రాలేదని విమర్శించారు. మహాత్మా గాంధీ, ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ దేశం కోసం అసువులు బాసారని, రాజీవ్ విగ్రహంపై సంకుచిత ఆలోచనతో విమర్శలు చేస్తున్నారని అన్నారు. ఈ రోజు దేశం అంతా ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీల త్యాగాలను గుర్తు చేసుకుంటున్నారని చెప్పారు. ఈ దేశానికి స్వాతంత్ర్యం తెచ్చింది కాంగ్రెస్ పార్టీ అని.. దేశ ప్రజల హక్కులను, స్వాతంత్ర్యా న్ని కాపాడటానికి అండగా నిలబడతామని ఈ సందర్భంగా సీఎం చెప్పారు.

# తుపాకులతో గర్జించిన ఛత్తీస్‌ఘడ్

(మొదటి పేజీ తరువాయి)

ధ్రువీకరించారు. కేశవరావుపై రూ.1.5కోట్లు రివార్డు ఉందని తెలిపారు. 'నక్సలిజం నిర్మూలనలో ఇదొక మైలు రాయి విజయం అంటూ అమిత్ షా పేర్కొన్నారు. ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణ్‌పూర్‌లో జరిగిన ఆపరేషన్‌లో 27మంది మావోయిస్టులు మృతిచెందారు. వీరిలో మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి, నక్సల్ ఉద్యమానికి వెన్నెముకగా ఉన్న నంబాల కేశవరావు అలియాస్ బసవరాజు ఉన్నారు. నక్సలిజానికి వ్యతిరేకంగా కొనసాగిస్తున్న మూడు దశాబ్దాల పోరులో ప్రధాన కార్యదర్శి స్థాయి కలిగిన నేత మృతి చెందడం ఇదే తొలిసారి. ఈ క్రమంలో భద్రతా దళాలకు అభినందనలు తెలిపారు. ఆపరేషన్ బ్లాక్ ఫారెస్టు పూర్తయిన తర్వాత ఛత్తీస్‌గఢ్, తెలంగాణ, మహారాష్ట్రలలో 54మంది నక్సలైట్లు అరెస్టు అయ్యారు. 84మంది లొంగిపోయారు. 2026 మార్చి 31 నాటికి నక్సలిజాన్ని నిర్మూలించేందుకు మోదీ సర్కార్ దృఢ సంకల్పంతో ఉంది' అని అమిత్ షా ఎక్స్‌లో పేర్కొన్నారు. ఎన్‌కౌంటర్‌లో మరణించిన నంబాల కేశవరావును బసవరాజు, క్రిష్ణ, వినయ్, గంగన్న, బసవర రాజు, ప్రకాష్, బీఆర్, ఉమేష్, రాజు, విజయ్, కేశవ్, దారపు నరసింహారెడ్డి, నరసింహ అని మారు పేర్లతో కూడా పిలిచేవారు. 2018 నవంబర్‌లో ముప్పాల లక్ష్మణరావు అలియాస్ గణపతి రాజీనామా తర్వాత అతను పార్టీకి సుప్రీం కమాండర్ అయ్యారు. శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళి మండలం జియ్యన్నపేట గ్రామంలో 1955లో కేశవరావు జన్మించారు. తండ్రి వాసుదేవరావు ఉపాధ్యాయుడు. కేశవరావుకు సోదరుడు, ముగ్గురు అక్కాచెల్లెళ్లు ఉన్నారు.కేశవరావు ప్రాథమిక విద్య స్వగ్రామంలోనే సాగింది. తాతగారి ఊరు అయిన టెక్కలి మండలం తలగాంలో హైస్కూల్ విద్య, టెక్కలి జూనియర్ కళాశాలలో ఇంటర్ చదివిన ఆయన.. డిగ్రీ రెండో సంవత్సరం చదువుతుండగా వరంగల్‌లో బీటెక్ రావడంతో అక్కడికి వెళ్లి జాయిన్ అయ్యారు. వరంగల్‌లోని రీజినల్ ఇంజినీరింగ్ కళాశాల (ఆర్‌ఈసీ) బీటెక్ చదువుతుండగానే రాడికల్ విద్యార్థి సంఘం వైపు అడుగులు వేశారు. 1984లో ఎంటెక్ చదువుతున్నప్పుడు సీపీఐ(ఎంఎల్) పీపుల్స్‌వార్ గ్రూపు సిద్దాంతాలు, భావజాలం పట్ల ఆకర్షితులయ్యారు. ఎంటెక్ చదువుకు మధ్యలోనే స్వస్తి చెప్పి ఉద్యమంలో చేరారు. అప్పటి నుంచి 43 ఏళ్లుగా అజ్ఞాతంలోనే ఉన్నారు. నక్సల్‌బరి ఉద్యమంలో చేరాక స్వగ్రామానికి ఎప్పుడూ రాలేదని గ్రామస్థులు చెబుతున్నారు. మిలటరీ దాడుల వ్యూహకర్తగా నంబాల కేశవరావుకు పేరుంది. మిలిటరీ ఆపరేషన్లలో సిద్ధహస్తులు. మిలటరీ వ్యూహాల రూపకల్పన, అమలు, ఆయుధాల వ్యాపారులతో సత్సంబంధాలు నెరపడం ఆయన ప్రత్యేకతలు. దశాబ్దకాలం పాటు కేంద్ర మిలటరీ కమిషన్ కార్యదర్శిగా పనిచేశారు. గణపతి తర్వాత పార్టీ కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు. గణపతితో పోల్చితే పార్టీ సిద్దాంతాల అమల్లో మరింత కఠినంగా వ్యవహరించేవారు. దూకుడు స్వభావం కలిగిన కేశవరావు.. ప్రతిఘటన ద్వారానే లక్ష్యం సిద్ధిస్తుందని బలంగా నమ్మే స్వభావమని ఓ పోలీసు అధికారి తెలిపారు. అలిపిరిలో చంద్రబాబుపై జరిగిన క్లైమోర్ మైన్స్ దాడిలో ప్రధాన సూత్రధారి నంబల కేశవరావు. ముఖ్యంగా 2010 ఏప్రిల్లో ఛత్తీస్‌గఢ్‌లోని చింతల్నార్ ఘటనలో వ్యూహం ఆయనదే. గస్తీకి వెళ్లి తిరిగివస్తున్న సీఆఆర్పీఎఫ్ జవాన్లు రెండు కొండల మధ్యకు వచ్చాక మావోలు అకస్మాత్తుగా విరుచుకుపడ్డారు. జవాన్లు పారిపోయే అవకాశం కూడా దక్కలేదు. ఈ ఘటనలో 74 మంది జవాన్లు చనిపోయారు. 2013లో సల్వాజుడుం వ్యవస్థాపకుడు మహేంద్రకర్మపై దాడి వ్యూహం కూడా కేశవరావుదే. ఈ ఘటనలో మహేంద్రకర్మతోపాటు మరో 27 మంది మరణించారు.

# రాగల మూడ్రోజులు వర్షాలు

## - అప్రమత్తంగా ఉండాలని అధికారులకు సిఎం సూచన

**హైదరాబాద్,మే 21(పిసిడబ్ల్యు న్యూస్):** హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో వర్షాలు పడుతున్నందున అప్రమత్తం గా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మరో మూడు రోజులు వర్షాలు పడే అవకాశ ముందని వాతావరణ శాఖ ఇచ్చిన సూచనలకు అనుగుణంగా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు, మార్కెట్లలో ఉన్న ధాన్యం తడవకుండా తగిన రక్షణ చర్యలు చేపట్టాలని, కాంటాలు వేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించాలని అన్ని జిల్లాల కలెక్టర్లను ముఖ్యమంత్రి ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు ఇబ్బంది పడకుండా తగిన చర్యలు చేపట్టాలని అన్నారు. హైదరాబాద్ సిటీలో వర్షం కురుస్తున్న ప్రాంతాల్లో రోడ్లపై నీరు నిల్వ లేకుండా చూడాలని, ట్రాఫిక్ ఇబ్బందులు, విద్యుత్తు సమస్యలు లేకుండా చూడాలని సీఎం ఆదేశించారు. జీహెచ్‌ఎంసీ, పోలీస్, హైడ్రా, ట్రాఫిక్, విద్యుత్తు విభాగాలు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. పరిస్థితిని సమీక్షించాలని సీఎస్‌ను ఆదేశించారు. ఇక వాతావరణశాఖ ప్రకారం మరో రెండు రోజులు వర్షాలు పడతాయన్న సీఎం అధికారులను అప్రమత్తం చేస్తున్నారు.

# కావాలనే కాళేశ్వరం విచారణ జాప్యం

(మొదటి పేజీ తరువాయి)

నేడు నువ్వు చేస్తున్నావంటూ సీఎం రేవంత్ రెడ్డిపై ఈటల రాజేందర్ మండిపడ్డారు. నువ్వు మమల్ని బెదిరిస్తే భయపడమన్నారు. కేంద్రంలో తమ పార్టీనే అధికారంలో ఉందని ఈ సందర్భంగా ఎంపీ ఈటల రాజేందర్ గుర్తు చేశారు. నీ చిట్టా అంతా తమ చేతిలో ఉందన్నారు. నీ దిక్కుమాలిన చిల్లర గాళ్ళతో మాట్లాడిస్తే తాను వెనక్కి పోనంటూ సీఎం రేవంత్ రెడ్డికి ఎంపీ ఈటల ఘాటుగా వార్నింగ్ ఇచ్చారు.కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో భాగంగా మేడిగడ్డ బ్యారేజీని కేసీఆర్ ప్రభుత్వ హయాంలో నిర్మించారు. అయితే ఈ బ్యారేజీలోని పలు పిల్లర్లు 2023లో కుంగాయి. ఈ అంశం నాటి ప్రతిపక్షం కాంగ్రెస్ పార్టీ తన ప్రచారాస్త్రంగా మలుచుకుంది. 2024లో ఎన్నికల ప్రచారంలో భాగంగా తాము అధికారంలోకి వస్తే.. సుప్రీంకోర్టు రిటైర్డ్ జడ్జితో ఈ బ్యారేజీ నిర్మాణంపై విచారణ జరిపిస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. ఇక ఆ ఎన్నికల్లో తెలంగాణ ఓటరు కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టాడు. దీంతో రేవంత్ రెడ్డి సారథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువు తీరింది. నంతరం ఈ అంశంపై సుప్రీంకోర్టు రిటైర్డ్ జడ్జి పీసీ ఘోష్ సారథ్యంలో విచారణ కమిషన్‌ను రేవంత్ రెడ్డి ప్రభుత్వం నియమించింది. ఈ కమిషన్ విచారణలో భాగంగా పలువురు ఉన్నతాధికారులతోపాటు సిబ్బందిని సైతం ప్రశ్నించింది. అలాగే పలువురు స్వచ్ఛందంగా ఈ విచారణకు హాజరై.. పలు విషయాలను జస్టిస్ పీసీ ఘోష్‌కు వివరించారు. సీఎం కేసీఆర్‌తోపాటు ఆయన కేబినెట్‌లో మంత్రులుగా వ్యవహరించిన హరీశ్‌రావు, ఈటల రాజేందర్‌లకు కమిషన్ నోటీసులు జారీ చేసింది. జూన్ 5వ తేదీన కేసీఆర్, జూన్ 6వ తేదీన హరీశ్ రావు.. అలాగే జూన్ 9వ తేదీన ఈటల రాజేందర్ కమిషన్ ముందు హాజరు కావాలని ఆ నోటీసుల్లో కమిషన్ స్పష్టం చేసింది. కేసీఆర్ కేబినెట్‌లో భారీ నీటి పారుదల శాఖ మంత్రిగా హరీశ్ రావు, ఆర్థిక శాఖ మంత్రిగా ఈటల రాజేందర్ పని చేసిన సంగతి తెలిసిందే.

# రాజీవ్‌గాంధీకి కాంగ్రెస్ నేతల నివాళి

(మొదటి పేజీ తరువాయి)

ప్రదేశంలో రాజీవ్‌కి ఘనంగా నివాళులర్పించారు. రాజీవ్ గాంధీ వర్థంతి సందర్భంగా కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆయనను భారతదేశ ముద్దుబిడ్డ అని అభివర్ణించారు. ఈ సందర్భంగా రాజీవ్‌గాంధీ ప్రధానిగా ఉన్న సమయంలో తీసుకున్న పలు కీలక నిర్ణయాలని ప్రస్తావిస్తూ ఖర్గే ఎక్స్ పోస్టు చేశారు. రాజీవ్‌గాంధీ నేతృత్వంలోనే 18 ఏళ్లకే ఓటు హక్కు కల్పించడం, పంచాయతీరాజ్‌ను బలోపేతం చేయడం వంటి కీలక నిర్ణయాలు తీసుకున్నారు. అలాగే టెలికాం, ఐటి విప్లవానికి నాయకత్వం వహించారు. కంప్యూటరీకరణను అమలు చేశారు. సమ్మిళిత అభ్యాసంపై దృష్టి సారించిన కొత్త విద్యావిధానాన్ని ప్రవేశపెట్టిన ఘనత ఆయనదే. రాజీవ్‌గాంధీ లక్షలాది మంది భారతీయులలో ఆశను ప్రేరేపించారు. 21వ శతాబ్దపు సవాళ్లు, అవకాశాలకు భారతదేశాన్ని సిద్ధం చేయడంలో ఆయన దార్శనికత, సాహసోపేతమైన నిర్ణయాలు కీలకపాత్ర పోషించాయి అని ఖర్గే ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. ‡రాజీవ్ గాంధీ వర్థంతి సందర్భంగా రాహుల్ తన తండ్రి రాజీవ్‌తో కలిసి దిగిన ఫొటోను సోషల్ మీడియాలో పోస్టు చేశారు. ఈ ఫొటోకు జతగా 'నాన్న మీ జ్ఞాపకాలు నన్ను ప్రతి అడుగులోనూ నడిపిస్తాయి. మీ నెరవేరని కలలను నిజం చేయడమే నా సంకల్పం. నేను వాటిని ఖచ్చితంగా నెరవేరుస్తాను' అని రాహుల్ ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. ‡రాజీవ్‌గాంధీ 40 ఏళ్ల వయసులోనే ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. అక్టోబర్ 1984 నుంచి 1989 డిసెంబర్ 2 వరకు ఆయన ప్రధానిగా ఉన్నారు. తమిళ ఈలం ఆత్మాహుతి దాడిలో ఆయన దుర్మరణం చెందారు.

# తెలంగాణలో ప్రభుత్వాన్ని కూల్చే కుట్ర

- బిజెపి, బిఆర్ఎస్, టిడిపి ఏకమయ్యాయి
- ఎంపి మల్లు రవి సంచలన ఆరోపణలు

**హైదరాబాద్,మే 21(పిసిడబ్ల్యు న్యూస్):** తెలంగాణలో ప్రజా ప్రభుత్వాన్ని కూల్చే కుట్రలు చేస్తున్నారని ఎంపీ మల్లు రవి సంచలన వ్యాఖ్యలు చేశారు. కొందరు పనిగట్టుకుని ఇదే పనిలో ఉన్నారని మండిపడ్డారు. బీజేపీతో కలిసి బీఆర్ఎస్ ప్రజా ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టే ప్రయత్నం చేస్తోందన్నారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్, టీడీపీ కలిసి తెలంగాణలో పోటీ చేయబోతున్నాయని బాంబు పేల్చారు. ముగ్గురు కలిసి ఎన్ని కుట్రలు చేసినా ప్రజా ప్రభుత్వం మళ్ళీ అధికారంలోకి వస్తుందన్నారు. కెసిఆర్‌కు కాళేశ్వరం కమిషన్ ఇచ్చిన నోటీసులకు కాంగ్రెస్‌కి సంబంధం లేదని చెప్పారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చట్టానికి అతీతులా? ఎంతో మంది మాజీ ముఖ్య మంత్రులు జైలుకి వెళ్ళారు అని అన్నారు. బిహార్ లో లాలు ప్రసాద్ యాదవ్ జైలుకు వెళ్లలేదా? కేసీఆర్, హరీష్, ఈటెల కమిషన్ ముందు హాజరు కావాలన్నారు. నోటీసులు అందక పోవడం మనం ఏమైనా అమెరికాలో ఉన్నామా? విద్యుత్ కమిషన్ విషయంలో కెసిఆర్ తప్పు చేశారు. ఇప్పుడైనా కాళేశ్వరం కమిషన్ కు సహకరించాలని మల్లు రవి సూచించారు.

# మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతకు షాక్

- గాంధీభవన్‌లో ధర్నా చేసినందుకు నోటీసులు



**హైదరాబాద్,మే 21(పిసిడబ్ల్యు న్యూస్):** తెలంగాణ కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు సునీతా రావుకు పార్టీ అధిష్టానం షోకాజ్ నోటీసులిచ్చింది. టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్‌పై చేసిన వ్యాఖ్యలు, గాంధీ భవన్‌లో నిరసన చేయడాన్ని కాంగ్రెస్ అధిష్టానం తప్పుబట్టింది. క్రమశిక్షణను ఉల్లంఘించినందుకు సునీతా రావుకు జాతీయ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు నోటీసు జారీ చేశారు. సునీతా రావుకు ఏమైనా ఇబ్బంది ఉంటే పార్టీలో చర్చించాలి కానీ బహిరంగంగా మాట్లాడడం తప్పని.. దీనిపై 7 రోజుల్లో వివరణ ఇవ్వాలని జాతీయ మహిళా కాంగ్రెస్ లేఖలో పేర్కొంది. వివరణ ఇవ్వకపోతే కాంగ్రెస్ నిబంధనల మేరకు చర్యలు ఉంటాయని నోటీసులో అధిష్టానం స్పష్టం చేసింది. కొద్ది రోజుల క్రితం గాంధీభవన్‌లో సునీతా రావు నిరసన తెలిపిన విషయం తెలిసిందే. ముఖ్యంగా పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్‌పై పలు వ్యాఖ్యలు చేశారు. టీపీసీసీ చీఫ్ ఛాంబర్ ఎదుట సునీతారావు ధర్నాకు దిగారు. పది మంది మహిళా నాయకులతో కలిసి నిరసన చేపట్టారు. కాంగ్రెస్ మహిళా నేతలకు నామినేటెడ్ పదవులు ఇవ్వాలని.. పోస్టుల విషయంలో మహిళా నాయకులను పార్టీ పట్టించుకోవడం లేదని ఆమె ఆరోపించారు. ప్రభుత్వం, కార్పొరేషన్ పదవుల్లోనూ మహిళా నేతలకు సరైన ప్రాధాన్యత దక్కడం లేదని విమర్శించారు. మహేష్ గౌడ్ బంధువులకే పదవులు కట్టబెడు తున్నారంటూ ఆరోపణలు గుప్పించారు. కార్పొరేషన్లు, పార్టీ కమిటీల్లో మహిళా కాంగ్రెస్ నేతలకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేస్తూ సునీతారావు గాంధీభవన్‌లో ఆందోళనకు దిగారు. క్రమంలో అధికార పార్టీలో ఉంటూ పార్టీ ఆఫీసులో నిరసన చేపట్టడాన్ని అధిష్టానం తీవ్రంగా తప్పుబట్టింది. అలాగే టీపీసీసీ చీఫ్‌పై ఆరోపణలు చేయడాన్ని మహిళా కాంగ్రెస్ జాతీయ నాయకత్వం తప్పుబట్టింది. దీనిపై వివరణ ఇవ్వాల్సిందిగా సునీతారావుకు జాతీయ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు నోటీసులు జారీ చేశారు.

# రెండ్రోజుల పాటు తెలుగు రాష్ట్రాల్లో భారీ వర్షాలు

(మొదటి పేజీ తరువాయి)

ఈదురుగాలులతో కూడా వర్షాలు పడనున్నాయని అధికారులు తెలిపారు. గంటకు 40 నుంచి 50 కిలో మీటర్ల వేగంతో పలు జిల్లాలో వర్షం పడే అవకాశం ఉందంటున్నారు. పశ్చిమ, తూర్పు జిలాలకు భారీ వర్షాలు పడతాయని తెలిపారు. అటు తెలంగాణలోనూ పలు రాష్ట్రాల్లో కుండపోత వర్షాలు పడనున్నా యని వాతావరణ శాఖ తెలిపింది. 15 జిల్లాలకు భారీ వర్ష సూచన ఉందని అధికారులు వెల్లడించారు. హైదరాబాద్, నిజామాబాదు, కామారెడ్డి, మెదక్, సంగారెడ్డి, వికారాబాద్, మహబూబ్‌నగర్, నారాయణపేట, వనపర్తి, జోగులాంబ, గద్వాల్, నగర్ కర్నూల్, నల్గొండ, సూర్యాపేట, మహబూబ్‌బాద్, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భారీ వర్షాలు కురవనున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. ద్రోణి ప్రభావంతో తెలంగాణ రాగల ఐదురోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఆంధ్రప్రదేశ్ మధ్య ప్రాంతాలు, పరిసరాలను ఆనుకొని ఉన్న దక్షిణ తెలంగాణపై ఉపరితల ఆవర్తనం సగటు సముద్రమట్టానికి 3.1 కిలోమీటర్ల విస్తరించి ఉందని వాతావరణశాఖ పేర్కొంది. ఈ క్రమంలో నిజామాబాద్, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరించింది. భూపాలపల్లి, ములుగు, వరంగల్, హన్మకొండ, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, గంటకు 40–50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని చెప్పింది. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి జిల్లాల్లో గంటకు 30–40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులతో కూడిన వానలు పడే అవకాశాలున్నాయని చెప్పింది.గురువారం కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్, భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం జిల్లాల్లో అక్కడక్కడ భారీ వానలుపడుతాయని తెలిపింది. కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని చెప్పింది. అలాగే, శుక్ర, శని, ఆదివారాల్లోనూ హైదరాబాద్ సహా ఉత్తర, దక్షిణ తెలంగాణలోని పలు ప్రాంతాల్లో వానలు పడుతాయని వాతావరణశాఖ వివరించింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్టుని జారీ చేసింది

# నేషనల్ హెరాల్డ్ కేసులో విచారణ

(మొదటి పేజీ తరువాయి)

దిల్లీ రౌస్ అవెన్యూ కోర్టులో ప్రాసిక్యూషన్ కంప్లయింట్ దాఖలు చేశారు. దీనిపై తాజాగా విచారణ జరిగింది. నేషనల్ హెరాల్డ్ పత్రికకు సంబంధించి మనీ లాండరింగ్ ఆరోపణలతో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీని ఈడీ అధికారులు గతంలో పలుమార్లు విచారించిన విషయం తెలిసిందే. విదేశీ నిధులతో నేషనల్ హెరాల్డ్ పత్రికను పెంచి పోషించారన్న ఫిర్యాదుల మేరకు ఈడీ, సీబీఐ దర్యాప్తు చేశాయి. సీబీఐ విచారణ మధ్యలోనే నిలిచినప్పటికీ.. ఈడీ దర్యాప్తు మాత్రం కొనసాగుతోంది. ఈ కేసులో 2023, నవంబరులో జప్తు చేసిన అసోసియేటెడ్ జర్నల్స్ లిమిటెడ్ (ఏజేఎల్)కు చెందిన రూ.661 కోట్ల విలువైన ఆస్తుల స్వాధీనానికి చర్యలు ప్రారంభించింది. ఇందులోభాగంగా నోటీసులు జారీ చేసింది. ఆయా ఆస్తుల్లో ఉన్నవారు ఖాళీ చేయాలని పేర్కొంది. అద్దెకు ఉంటున్నవారు ఇకపై తమకే ఆ మొత్తాన్ని చెల్లించాలని తెలిపింది. అక్రమ చెలామణి నిరోధక చట్టంలోని సెక్షన్ (8) నిబంధన 5(1) ప్రకారం జప్తు చేసిన ఆస్తులను స్వాధీనం చేసుకొనే పక్రియ చేస్తున్నామని తెలిపింది. ఆస్తులు ఉన్న ప్రాంతాల్లో (దిల్లీ, ముంబయి, లఖ్‌నవూ) భవనాలకు నోటీసులు అంటించినట్లు వెల్లడించిన సంగతి తెలిసిందే.

# హయత్‌నగర్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

- ఆగివున్న డిసిఎంను ఢీకొన్న కారు
- ప్రమాదంలో ముగ్గురు వ్యక్తుల దుర్మరణం



**రంగారెడ్డి,మే 21(పిసిడబ్ల్యు న్యూస్):** హయత్ నగర్ మండలం కుంట్లూరులో ఘోర రోడ్డుప్రమాదం చోటు చేసుకుంది. బుధవారం తెల్లవారుజామున ఆగి ఉన్న డీసీఎంను కారు ఢీకొట్టింది. ఈ దుర్ఘటనలో కారులో ప్రయాణిస్తున్న ముగ్గురు ప్రయాణికులు అక్కడికక్కడే మృతి చెందారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వెంటనే స్పందించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అయితే కారులో ఇరుక్కుపోయిన మృతదేహాలను గడ్డ పార సహాయంతో పోలీసులు బయటకు తీశారు. మృతులు చంద్రసేనా రెడ్డి, త్రినాథ్ రెడ్డి, వర్షిత్ రెడ్డిగా గుర్తించారు. వీరంతా కుంట్లూరు గ్రామానికి చెందిన వారని పోలీసులు వెల్లడించారు. మరోవైపు మృతుల బంధువులకు పోలీసులు సమాచారం అందించారు. ఈ ఘటనలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారి పరిస్థితి సైతం విషమంగా ఉందని వైద్యులు వెల్లడించారు. ఈ ప్రమాదంతో కుంట్లూరులో విషాదఛాయలు అలముకున్నాయి. ఈ ప్రమాదంలో గాయపడిన అలిమేటి పవన్ కల్యాణ్ రెడ్డిని చికిత్స నిమిత్తం హయత్‌నగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

# కాంగ్రెస్, బిజెపి కుమ్మక్కు రాజకీయాలు

(మొదటి పేజీ తరువాయి)

కమీషన్ల పాలనగా మారిందని ధ్వజమెత్తారు. కమీషన్లు తప్ప రేవంత్ ప్రభుత్వానికి పాలన చేతకాదు అని ధ్వజమెత్తారు. ఎమ్మెల్యేలు, మంత్రులే కమీషన్లపై మాట్లాడుతున్నారని, ఎన్ని నోటీసులు ఇచ్చినా దూదిగింజల్లా ఎగిరిపోతాయన్నారు. కాళేశ్వరం దర్యాప్తు కీలక దశకు చేరుకున్న సందర్భంగా మాజీ సిఎం కెసిఆర్, మాజీ మంత్రులు హరీష్‌రావు, ఈటల రాజేందర్‌లు విచారణకు రావాలని జస్టిస్ పిసి ఘోష్ కమిషన్ నోటీసులు జారీచేసింది. ముగ్గురు హాజరయ్యేందుకు 15 రోజులు గడువును కమిషన్ ఇచ్చింది. కమిషన్ ఎదుట హాజరై కమిషన్ అడిగే ప్రశ్నలకు సమాధానాలు చెప్పాలని జస్టిస్ పిసి ఘోష్ ఈ నోటీసుల్లో పేర్కొన్న విషయం తెలిసిందే. ఈ రాష్ట్రంలో కొనసాగుతున్నది ప్రజా పాలన కాదు.. కమీషన్ల పాలన అని కేటీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు. గత 17 నెలలుగా పాలన చేతకాక, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల దృష్టిని మళ్లించే నాటకాలు ఆడుతోంది అని ధ్వజమెత్తారు. కమిషన్‌లు తప్ప ప్రభుత్వానికి మరో దారి కనిపించట్లేదు. పాలన కనిపించడం లేదు. డైరెక్ట్‌గా కాంట్రాక్టర్లు సచివాలయంలో ధర్నా చేయడం వాస్తవ పరిస్థితిని స్పష్టం చేస్తోంది. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, మంత్రులే కమీషన్‌లు లేనిదే పనులు జరుగడంలేదు అని స్వయంగా చెబుతున్నారని కేటీఆర్ పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ని అడుగుతున్నా.. ఎస్‌ఎల్‌బిసి టన్నెల్ కూలింది, 8 మంది ప్రాణాలు కోల్పోయారు. అక్కడ సహాయక చర్యలు చేపట్టే తెలివి కూడా లేకపోయింది. మీ కమిషన్‌ల ఆరాటంతో మృతదేహాలను వెలికితీయడానికి సైతం సాహసం చేయలేకపోయారు. అక్కడ ఏం జరిగిందో ఇప్పటికీ చెప్పలేని దద్దమ్మ ప్రభుత్వం ఇది. నల్గొండలో సుంకిశాల ప్రాజెక్ట్ కూలింది, ఇప్పటికీ ప్రభుత్వం స్పందించలేదు అని కేటీఆర్ పేర్కొన్నారు. ప్రజా సమస్యలను గాలికి వదిలేసి.. కాంగ్రెస్, బీజేపీ కలిసి నాటకాలు ఆడుతున్నాయి. కాళేశ్వరం ప్రాజెక్టుపై కుట్రలు చేస్తూ రాష్ట్ర అభివృద్ధిని బలిగొంటున్నారు. ఎప్పటికైనా న్యాయం, ధర్మం గెలుస్తాయి. నిజాయితీ ఎప్పటికీ ఓడిపోదు. మీరు ప్రకటించిన ఆరు గ్యారంటీలను అమలు చేయలేని చేతకాని ప్రభుత్వం ఇది. తులం బంగారం ఏమైంది? 4 వేల రూపాయల పింఛన్లు ఏమయ్యాయి? మీరు ఎన్ని నోటీసులు ఇచ్చినా అవి దూది పింజల్లా ఎగిరిపోతాయి. మీవి అన్ని చిల్లర ప్రయత్నాలు మాత్రమే. ప్రజలు మిమ్మల్ని తిరస్కరించనున్నారు. రేవంత్ రెడ్డికి బుద్ధి చెప్పే రోజులు త్వరలోనే వస్తాయి. ప్రజలు తిరగబడే రోజులు వచ్చాయని కేటీఆర్ పేర్కొన్నారు.

# ఉనికిచర్ల గ్రామానికి పట్టణ రూపు తీసుకువస్తా..

**● జాతీయ రహదారి నుండి ఉనికిచర్ల వరకు నాలుగు లైన్ల రోడ్డు, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు ● రూ.1కోటి 05లక్షలతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి**







**హనుమకొండ, మే 21(పిసిడబ్ల్యూ న్యూస్):** అతి త్వరలోనే ఉనికిచర్ల గ్రామానికి పట్టణ రూపు రేఖలు తీసుకువస్తానని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. గ్రేటర్ వరంగల్ 64వ డివిజన్ పరిధిలోని ఉనికిచర్ల గ్రామంలో 1కోటి 05లక్షల రూపాయలతో సిసి రోడ్లు, సైడ్ డ్రైన్లు, వరద కాలువల నిర్మాణానికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గతంలోనే ఉనికిచర్ల గ్రామ అభివృద్ధికి కూడా ద్వారా రూ. 3 కోట్ల రూపాయలు మంజూరు చేసినట్లు వెల్లడించారు. ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత స్వయంగా గ్రామానికి వచ్చి క్షేత్రస్థాయిలో గ్రామంలో పర్యటించి గ్రామ సమస్యలు తెలుసుకున్నానని, అందులో భాగంగానే బుధవారం రూ. 1కోటి 05లక్షల రూపాయలతో సిసి రోడ్లు, సైడ్ డ్రైన్లు, వరద కాలువల నిర్మాణానికి శంకుస్థాపన చేసుకున్నామని తెలిపారు. ఈ పనులను జులై 15లోగ పూర్తి చేయాలని అధికారులను, కాంట్రాక్టర్లను ఆదేశించారు. జాతీయ రహదారి నుండి ఉనికిచర్ల వరకు నాలుగు లైన్ల రోడ్డుతో పాటు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఏడాది లోగ ఈ రోడ్డు నిర్మాణం పూర్తి చేస్తానని హామీ ఇచ్చారు. అలాగే ఉనికిచర్ల నుండి రాపాకపల్లి రోడ్డుకు రూ. 41లక్షలు మంజూరు అయ్యాయని త్వరలోనే పనులు ప్రారంభం అవుతాయాని అన్నారు. గ్రామంలో స్మశాన వాటికకు ప్రహరీ గోడ, వ్యవసాయ భూములకు రోడ్డు ఏర్పాటు, కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి అతి త్వరలో మంజూరు ఇస్తానని హామీ ఇచ్చారు. అలాగే మహిళా కమ్యూనిటీ భవనం కావాలని అడిగారని, అది గ్రామస్తుల నిర్ణయం మేరకు నిర్మిస్తానని వెల్లడించారు. ఉనికిచర్ల గ్రామానికి 24ఇందిరమ్మ ఇల్లు మంజూరు అయ్యాయని, అతి త్వరలో మరో 24ఇల్లు మంజూరు ఇస్తానని హామీ ఇచ్చారు. రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి కోసం ముందుకు రావాలని, గ్రామస్తులందరూ కలిసి వస్తేనే గ్రామ అభివృద్ధి సాధ్యం అవుతుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ ఆవాల రాధికా రెడ్డి, గ్రేటర్ వరంగల్ డిప్యూటీ కమిషనర్ రవీందర్, ఈఈ సంతోష్, స్థానిక నాయకులు, బల్దియా అధికారులు, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# రక్తదానం ప్రాణదానంతో సమానం

**● రాజీవ్ గాంధీకి ఘనంగా నివాళులర్పించిన ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి ● యూత్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మెగా రక్త దాన శిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యేలు నాయిని, నాగరాజు ● ప్రతి ఒక్కయువత రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చిన ఎమ్మెల్యే నాగరాజు**








**హనుమకొండ, మే 21(పిసిడబ్ల్యూ న్యూస్):** ఆపదలో ఉన్నవారికి రక్తదానం చేయడం అంటే.. ప్రాణదానం చేసిన తో సమానమని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. బుధవారం నవ భారత నిర్మాత రాజీవ్ గాంధీ 34వ వర్ధంతి సందర్భంగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ నందు నేషనల్ యూత్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఉదయ్ భాను చిబ్ తెలంగాణ రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివచరణ్ ఆదేశాల మేరకు వరంగల్ అర్బన్ జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కేఆర్ దిలీప్ రాజ్ ఆధ్వర్యంలో సుమారు 60 మందితో నిర్వహిస్తున్న మెగా రక్తదాన శిబిరాన్ని స్థానిక వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి తో కలిసి వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు ప్రారంభించారు. అనంతరం రక్తదానం చేసిన వారిని ఎమ్మెల్యేలు నాయిని, నాగరాజు, యూత్ అధ్యక్షుడు అభినందించి ప్రశంస పత్రాలను అందజేశారు. తదనంతరం తలసేమియా వ్యాధితో బాధపడుతు చికిత్స పొందుతున్న వారిని ఎమ్మెల్యే నాగరాజు సందర్శించి వారికి మనోధైర్యం కల్పించారు. అదే విధంగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర సభ్యుడు కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఈవీ శ్రీనివాస్ వివాహ వార్షికోత్సవ సందర్భంగా ఎమ్మెల్యేలు నాయిని, నాగరాజు సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర సభ్యుడు ఈవి శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ అశ్విన్ రాథోడ్, రమాకాంత్ రెడ్డి, వరంగల్ పార్లమెంట్ ఇంచార్జ్ నేహాల్, వరంగల్ అర్బన్ జిల్లా యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు చెవ్వ శివరామకృష్ణ, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆవుల పవన్ కళ్యాణ్, జిల్లా, మండల, డివిజన్, గ్రామ యూత్ అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

# ఆరుగురు తహసీల్దార్‌ల బదిలీలు

**● ఆదేశాలు జారీ చేసిన కలెక్టర్**



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి, మే 21(పిసిడబ్ల్యూ న్యూస్):** సంగారెడ్డి జిల్లా కు చెందిన ఆరుగురు తహసీల్దార్ లను బదిలీ చేస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేసిన కలెక్టర్ వల్లూరు క్రాంతి. ఈమేరకు బుధవారంప్రకటించిన సమాచారం ప్రకారం సి హెచ్ రవీందర్ రెడ్డిని కొహీర్ కు, జయరామ్ ను సంగారెడ్డి కి, దేవదాస్ ను జిన్నారం కు, వెంకటేష్ ను అమీన్ పూర్ కు, సంధ్య ను చౌటకూర్ లకు తహసీల్దార్ లుగా, సదానందం ను కలెక్టరేట్ లోని సి సెక్షన్ కు బదిలీ చేసినట్లు కలెక్టర్ తెలిపారు.

# పేద ప్రజల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట

**● కాంగ్రెస్ ప్రభుత్వంలోనే పేద ప్రజలకు సంక్షేమ పథకాలు**

**● సీఎం రేవంత్ రెడ్డి ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీ నెరవేరుతుంది**

**● ధర్మసాగర్‌లో రూ.59లక్షల సిసి రోడ్ల ప్రారంభోత్సవం, అంగన్వాడీ కేంద్రం శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి**







**హనుమకొండ, మే 21(పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంపై 8లక్షల కోట్ల అప్పుభారం ఉన్నా, పేదల ప్రజల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి గారు అన్నారు. ధర్మసాగర్ మండల కేంద్రంలో 59లక్షల ఈజీఎస్ నిధులతో నిర్మించిన నాలుగు సిసి రోడ్లను ఎమ్మెల్యే కడియం శ్రీహరి ప్రారంభించారు. అనంతరం ప్రాథమిక పాఠశాల ఆవరణలో 12లక్షలతో నిర్మించనున్న అంగన్వాడీ కేంద్రం భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అంగన్వాడీ భవనాన్ని ఆరు నెలలలో పూర్తి చేయాలని, 12లక్షల నిధులు సరిపోకపోతే అదనపు నిధులు మంజూరు చేస్తానని అన్నారు. ధర్మసాగర్ గ్రామంలో మోడల్ కాలనీ, ఎస్సీ కాలనీలలో రోడ్లు, డ్రైన్లు నిర్మించాల్సిన అవసరం ఉందని త్వరలోనే మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. పేద ప్రజల ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమని, ప్రజలకు ఇచ్చిన ప్రతీ హామీని నెరవేర్చే ప్రయత్నం చేస్తుందని అన్నారు. ఒక్క ఆర్థిక సంవత్సరంలోనే 25లక్షల మంది రైతులకు 21వేల కోట్ల రుణ మాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందని స్పష్టం చేశారు. గత ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పేరుతొ ఉదరగొట్టిందని కానీ ఒక్క ఇల్లు ఇవ్వలేదని ఏద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఒకే ఏడాదిలో 4లక్షల 50వేల ఇళ్ల నిర్మాణానికి రూ. 22వేల 500 కోట్లను ఖర్చు చేస్తుందని తెలిపారు. పేద ప్రజలకు, నిజమైన లబ్ధిదారులకు మాత్రమే ఇందిరమ్మ ఇల్లు మంజూరు అవుతాయాని స్పష్టం చేశారు. ధర్మసాగర్ గ్రామానికి 68ఇల్లు మంజూరు అయ్యాయని, ఇల్లు మంజూరు అయిన లబ్ధిదారులు వెంటనే ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. మంజూరు అయిన రెండు నెలలలో ఇంటి నిర్మాణం చేపట్టకపోతే మంజూరు రద్దు అవుతుందని తెలిపారు. అలాగే ఇంటి నిర్మాణం 600 అడుగుల లోపు ఉండాలని, 600 అడుగులు దాటితే బిల్లులు రావడం ఇబ్బంది అవుతుందని తెలిపారు. రైతు రుణ మాఫీ, సన్నాలకు 500బోనస్, రైతు భరోసా పథకాలతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా కోటి రేషన్ కార్డుల ద్వారా 3 కోట్ల 10లక్షల మందికి ఉచితంగా సన్న బియ్యం పంపిణీ చేస్తున్నట్లు వెల్లడించారు. ఇలాంటి గొప్ప ప్రజా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం పై, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై మీ అందరి ఆశీర్వాదలు ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు, నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# హిందువుగా పుట్టిన ప్రతి ఒక్కరు హిందూ ఏక్తా యాత్రలో పాల్గొనాలి...

**● ఈ యాత్ర పహల్గాం మృతులకు అంకితం కాబోతుంది.**

**● వేలాదిగా కాకుండా హిందూ ఐక్యతను చాటేందుకు లక్షలాదిగా తరలిరావాలి.**

**● ఈ యాత్ర విజయవంతంతో అర్బన్ నక్సల్స్ కు గుణపాఠం చెప్పాలి.**

**● ప్రతి గడప గడప నుండి యాత్రకు హిందువులు తరలివచ్చి సైనికులకు సంఘీభావం తెలపాలి.**

**● బీజేపీ సీనియర్ నాయకులు, న్యాయవాది బేతి మహేందర్ రెడ్డి పిలుపు**



**కరీంనగర్,మే21(పీసీడబ్ల్యూ న్యూస్):** ప్రతి ఏడాది కరినగర్ నడిబొడ్డున నిర్వహిస్తున్న హిందూ ఏక్తా యాత్ర ఈసారి మరో శకానికి నాంది పలికేలా ఉండాలంటే హిందువుగా పుట్టిన ప్రతి ఒక్కరు గడప గడప నుండి లక్షలాదిగా తరలివచ్చి ఈ హిందూ ఏక్తా యాత్రను విజయవంతం చేసి "పహల్గాం మృతులకు అంకితం" చేసే విధంగా ఉండాలంటే ప్రతి హిందువు స్వచ్ఛందంగా ఈ హిందూ ఏక్తా యాత్రకు తరలిరావాలని న్యాయవాది, బీజేపీ సీనియర్ నాయకులు బేతి మహేందర్ రెడ్డి ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ కుమార్ నేతృత్వంలో నిర్వహించే ఈ హిందూ ఏక్తా యాత్ర తేదీ 22 మే 2025 గురువారం రోజున సాయంత్రం 4:00 గంటలకు కరినగర్ లోని వైశ్యభవన్ నుండి ప్రారంభమవుతుందని, ఈ యాత్రకు ముఖ్య అతిథిగా సామాజిక సమరసత వేదిక తెలంగాణ ప్రాంత సంఘటన మంత్రి, అఖిల భారత సాంస్కృతిక కళా ప్రముఖ్ శ్రీ అప్పాల ప్రసాద్ జీ పాల్గొంటున్నారని, ఈ యాత్ర వైశ్యభవన్ నుండి ప్రారంభమై రాజీవ్ చౌక్, టవర్ సర్కిల్, గంజ్, కమాన్, వన్ టౌన్ పోలీస్ స్టేషన్, బస్టాండ్, సిపి ఆఫీస్, కలెక్టర్ క్యాంపు ఆఫీస్, మదీన కాంప్లెక్స్ నుండి తిరిగి మళ్లీ వైశ్యభవన్ కు చేరుకుంటుందని బేతి మహేందర్ రెడ్డి తెలిపారు. ఈ హిందూ ఏక్తా యాత్రకు వేలాదిగా కాకుండా లక్షలాదిగా హిందూ బంధువులు తరలిరావాలని, ఈ యాత్ర విజయవంతంతో దేశంలో ఉంటూ, దేశానికి వ్యతిరేకంగా, హైందవ ధర్మానికి వ్యతిరేకంగా, హిందువులకు వ్యతిరేకంగా మాట్లాడుతూ పాకిస్తాన్ లాంటి ఉగ్రవాద దేశాలకు వంతపాడుతున్న అర్బన్ నక్సల్స్ అనే దేశద్రోహులకు గుణపాఠం చెప్పే విధంగా ఈ యాత్ర కొనసాగాలంటే ప్రతి హిందువు ప్రతి గడప గడప నుండి తరలిరావాలని బేతి మహేందర్ రెడ్డి కోరారు. ముఖ్యంగా ఈ యాత్ర పహల్గాం మృతులకు అంకితం చేసేలా, భారత త్రివిధ దళాలకు సంఘీభావం తెలిపేలా ఉండబోతోందని, వారిని స్ఫూర్తిగా తీసుకొని హిందువుగా పుట్టిన ప్రతి ఒక్కరు పార్టీలకు అతీతంగా ఈ యాత్రలో తప్పకుండా పాల్గొని యాత్రను విజయవంతం చేసే విధంగా పెద్ద ఎత్తున తరలిరావాలని బీజేపీ సీనియర్ నాయకులు, న్యాయవాది బేతి మహేందర్ రెడ్డి కోరుతూ పిలుపునిచ్చారు.



# జూలైలో స్థానిక సంస్థల ఎన్నికలు!

**హనుమకొండ, మే 21(పిసిడబ్ల్యూ న్యూస్):** రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న తరుణంలో సీఎం రేవంత్ రెడ్డి ఎమ్మెల్యేలకు ఎన్నికలపై స్పష్టత ఇచ్చినట్లు తెలుస్తోంది. జూలైలో లోకల్ ఎలక్షన్స్ నిర్వహించే అవకాశం ఉందని చెప్పినట్లు సమాచారం. ప్రస్తుతం పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలోని ఎమ్మెల్యేలతో సీఎం రేవంత్ సమావేశమవుతున్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలు, ఎమ్మెల్యేల పనితీరుపై సమీక్షిస్తున్నారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచిస్తున్నారు.

# మండల అధ్యక్ష పదవికి నామినేషన్ వేసిన మండల ప్రధాన కార్యదర్శి తేళ్ల హరిప్రసాద్



**మలుగు జిల్లా, మే 21 (పిసిడబ్ల్యూ న్యూస్):** ములుగు జిల్లా కేంద్రంలో గల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడిగా రెండు సార్లు మండల ప్రధాన కార్యదర్శిగా ఒకసారి వైస్ ఎంపీపీగా రెండు సార్లు క్లస్టర్ ఇంచార్జిగా సీతక్క గెలుపులో కాంగ్రెస్ పార్టీ అభివృద్ధిలో బాటలు వేసిన హరి ప్రసాద్ గారికి మండల అధ్యక్ష పదవి రావాలని కోరుతూ కాంగ్రెస్‌లో సీనియర్ నేతగా కొనసాగుతూ ప్రస్తుతం మండల ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతూ గోవిందరావుపేట మండల కాంగ్రెస్ పార్టీ అభివృద్ధిలో కీలకంగా మారినా తేళ్ల హరి ప్రసాద్ మండల అధ్యక్ష పదవికి నామినేషన్ వేయడం జరిగిందని కావున తేళ్ల హరి ప్రసాద్ కి గోవిందరావుపేట మండల అధ్యక్ష పదవి ఇవ్వాలని రెండు సార్లు మండల ప్రధాన కార్యదర్శిగా ఒకసారి వైస్ ఎంపీపీగా సీతక్క అసెంబ్లీ ఎన్నికల్లో రెండు సార్లు క్లస్టర్ ఇంచార్జిగా పని చేసి మండలంలో అందరికంటే ఎక్కువ మెజారిటీ అందించి సీతక్క గారి గెలుపులో ప్రధాన పాత్ర పోషించాడు అని కావున కాంగ్రెస్ పార్టీ గోవిందరావుపేట మండల అధ్యక్ష పదవి తేళ్ల హరిప్రసాద్ కి ఇవ్వాలని మంత్రి సీతక్క గారి జిల్లా అధ్యక్షులు పైడాకుల అశోక్ ఆశీర్వాదంతో కాంగ్రెస్ పార్టీని మండలంలో బలోపేతం చేస్తానని ఐక్యతతో పార్టీ కోసం కష్టపడి కార్యకర్తలందరికీ అందుబాటులో ఉంటూ ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజలకు అందేలా చేస్తూ కాంగ్రెస్‌ని మండలంలో అభివృద్ధి చేసి వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పని చేస్తాడని కావున ప్రజల ఆశీర్వాదంతో ముందుకు సాగుతారు అని, అధిష్ఠానం తేళ్ల హరి ప్రసాద్ కి ఒక అవకాశం ఇవ్వాలని కోరారు

# స్టాళ్లు పరిశీలించిన జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే

**చిట్యాల, మే 21 (పిసిడబ్ల్యూ న్యూస్):** కాళేశ్వరంలోని పుష్కరాలు ఘాట్ వద్ద స్టాళ్లను పరిశీలించిన సందర్భంగా... జయశంకర్ భూపాలపల్లి జిల్లా .చిట్యాల మండలం జూకల్ గ్రామానికి చెందిన మధు యంత్రం ద్వారా మొక్కజొన్న కంకులు కాల్చే విధానం, ఉడికించే విధానాన్ని పరిశీలించి రుచి చూసిన అనంతరం బాగా ఉంది అంటూ జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ . జిల్లాఎస్పి కిరణ్. గార్లు. ప్రశంసించారు. ఇలాంటివి మహిళా సంఘాల ద్వారా ప్రమోట్ చేయాలని డిఆర్డీఓ కు సూచించారు.



## జిల్లా కలెక్టర్ కుటుంబ సభ్యులతో సరస్వతి పుష్కర దర్శనం



**కాళేశ్వరం,మే 21 (పీసీడబ్ల్యూ న్యూస్):**భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రా హుల్ శర్మ బుధవారం ఉదయం తన కుటుంబ సభ్యులతో కలిసి గోదావరిలో పుష్కర స్నానం ఆచరించారు. అనంతరం కాళేశ్వ రంలోని ప్రసిద్ధ కాళేశ్వర ముక్తీశ్వర స్వామిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.పుష్కరాలు భక్తి, శ్రద్ధలకు ప్రతీకగా నిలుస్తున్నాయని, భక్తులు త్రివేణి సంగమంలో పుష్కర స్నానం చేయడం వల్ల ఆధ్యాత్మికంగా శు భఫలితాలు లభిస్తాయని పేర్కొన్నారు.దేవాలయ అధికారులు కలెక్టర్ కుటుంబానికి పూర్ణ సేవలు అందించారు. భద్రతా ఏర్పా ట్లను సమీక్షించిన కలెక్టర్, పుష్కరాలకు సంబంధించిన ఇతర ఏర్పాట్లపై అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా భక్తులు వాహనాల్లో అధికంగా వచ్చే అవకాశం ఉన్నందున అదనంగా పార్కింగ్ స్థలాలను కూడా గుర్తించనున్నట్లు తెలిపారు.

## నూతన వస్త్రాలంకరణ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు



**మహా ముత్తారం,మే 21 (పీసీడబ్ల్యూ న్యూస్):** ఈరోజు మహా ముత్తారం మండలం రెడ్డిపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, నూకల రవి కుమార్తె శ్రీజ,నూతన వస్త్రాలంకరణ కార్యక్రమంలో పాల్గొని చిన్నారిని ఆశీర్వదించిన మండల పార్టీ అధ్యక్షుడు పక్కల సడవలి ఈ కార్యక్రమంలో మండల పార్టీ ఉపాధ్యక్షులు రాజు నాయక్, సింగారం మాజీ సర్పంచ్ నరసయ్య, బోర్ల గూడెం, నిమ్మగూడెం గ్రామ శాఖ అధ్యక్షులు, నావరాం నాయక్, దన్ సింగ్ నాయక్, నాయకులు భాస్కర్ నాయక్ గుండాల మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

## మామిడి కాయ పచ్చడి విషయంలో గొడవ



**కాల్వ శ్రీరాంపూర్:మే 21 (పీసీడబ్ల్యూ న్యూస్):** పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ లో మామిడికాయ పచ్చడి పెట్టె విషయంలో తలెత్తిన గొడవలో భార్యను గొంతు నులిపి చంపాడు భర్త. ఈ ఘటన పందిళ్ల గ్రామంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన సూర అంజలి- సూర రాజ్‌కుమార్ దంపతులు. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆదివారం సాయంత్రం మామిడి కాయ పచ్చడి పెట్టేందుకు అంజలి సన్నద్ధమైంది. అవసరమైన వెల్లుల్లి కొనుక్కు రావాలని భర్త రాజ్ కుమార్ సూచించింది.ఈ విషయంలో దంపతుల మధ్య గొడవ జరిగింది. కోపోద్రిక్తుడైన రాజ్ కుమార్.. అంజలి(27)ను గొంతు నులిమి చంపేశాడు. ఈమెరకు మృతురాలి తండ్రి సంపంగి మల్లేశ్ సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. శవాన్ని పరిశీలించిన పోలీసులు ఆసుపత్రికి చికిత్స. మృతురాలి భర్త రాజ్ కుమార్ పై కేసు నమోదు చేశామని ఎస్సై వెంకటేశ్ తెలిపారు.

## వరద వలన నిలిచిపోయిన రాకపోకలు



**కనేకల్ మే 21 (పీసీడబ్ల్యూ న్యూస్):** నిన్న కురిసిన వర్షానికి.హానకనహల్ చెరువు నుండి వేదవతి నదికి భారీగా నీరు ప్రవహించి కనేకల్ మాల్యం రహదారి మీద నీటి ప్రవాహం ఎక్కువగా ఉన్నది కావున ప్రయాణికులు ఎవరు కూడా వాహనాలు నది మీద పోవుటకు లేదు ప్రభుత్వం వెంటనే నది మీద బ్రిడ్జి నిర్మించాలని మాల్యం ప్రజలు కోరుచున్నారు

# మండలస్థాయి ప్రాథమిక ఉపాధ్యాయులకు శిక్షణ

- రాష్ట్ర పరిశీలకులు బొమ్మెర కుమార స్వామి
- ఉపాధ్యాయులకు 5 రోజుల శిక్షణ: మండల విద్యాధికారిణి శ్రీదేవి





**ఖానాపూరం మే 21 (పీసీడబ్ల్యూ న్యూస్):** ఖానాపురం మండలంలో ఉపాధ్యాయులు శిక్షణలో నేర్చుకున్న మెలకువలను తరగతి గదిలో వినయోగించాలని శిక్షణ కార్యక్రమ రాష్ట్ర పరిశీలకులు డాక్టర్ బొమ్మెర కుమారస్వామి అన్నారు. బుధవారం మండలంలోని మోడల్ పాఠశాలలో నిర్వహిస్తున్న 5 రోజుల శిక్షణ శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి , కోర్స్ డైరెక్టర్ శ్రీదేవితో కలిసి శిక్షణ నిర్వహణా వివరాలను తెలుసుకున్నారు .ఎంఈఓ శ్రీదేవి మాట్లాడుతూ మండల స్థాయి ప్రాథమిక ఉపాధ్యాయులకు వృత్యంతర శిక్షణ 5 రోజుల పాటు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థులను ఉత్తమ ఫలితాలు సాధించే విధంగా ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారని తెలిపారు. శిక్షణ ద్వారా విద్యార్థులకు మెరుగైన,సులభమైన బోధన అందించేందుకు అవకాశం ఉందన్నారు. ఈ శిక్షణలో 59 మంది ఉపాధ్యాయులు, 8 మంది మండల రిసోర్స్ పర్సన్స్ పాల్గొంటున్నట్లు తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమంలో ఆర్పీలు వాగ్య, కిరణ్, భిక్షపతి,శ్రీనివాస్,చంద్రమౌళి, సారయ్య, కరుణాకర్,భద్రు లతో పాటు ఉపాధ్యాయులు ,ఎంఆర్సి సిబ్బంది శశిధర్, రాజేందర్,రమేష్, భాస్కర్, శ్రీను , మహేందర్ , రజని తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ 34వ వర్ధంతి

- జిల్లా అధికార ప్రతినిధి కిష్టయ్య



**చిట్యాల, మే 21 (పీసీడబ్ల్యూ న్యూస్):** చిట్యాల మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ టౌన్ అధ్యక్షులు బుర్ర లక్ష్మణ్ ఆధ్వర్యంలో భారత మాజీ ప్రధాని శ్రీ రాజీవ్ గాంధీ 34వ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కిష్టయ్య. వర్కింగ్ ప్రెసిడెంట్ మూలశంకర్ గౌడ్ .హాజరై ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత ప్రధానిగా టెక్నాలజీ. యువతపై .దృష్టి చారించి దేశాన్ని ఆధునిక రంగంలోకి నడిపించారని 18 సంవత్సరాలకే యువతకు ఓటు హక్కు కల్పించి. రాజీవ్ గాంధీ పేరిట స్థాపించబడిన రాజీవ్ గాంధీ ఫౌండేషన్ నేటికీ .విద్య ఆరోగ్యం .సామాజిక అభివృద్ధి కోసం కృషి చేస్తోంది ఆయన విధానాలు భారతదేశ అభివృద్ధిలో కీలకపాత్ర పోషించాయని తెలిపారుఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి చిలుకల రాయకోంరు . చిట్యాల ఫర్టిలైజర్ పెస్టిసైడ్స్ మండల అధ్యక్షులు గుమ్మడి సత్యనారాయణ . సీనియర్ నాయకులు సరిగొమ్ముల సదయ్య . చిలుముల రాజమౌళి బుర్ర మల్లేష్. గుర్రపు తిరుపతి. బుర్ర కరుణాకర్ . ఆరేపల్లి నరసింహారాములు. శనిగరపు మొగిలి. గుర్రపు నరసయ్య.తదితరులు పాల్గొన్నారు

## ఫ్రెండ్లీ పోలీసింగ్‌లో పస్ర పోలీస్ ఉత్తమం



**ములుగు జిల్లా, మే 21 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణలోనే అత్యుత్తమ పెండ్లి పోలీస్ ఆఫీసర్ గా గోవిందరావుపేట మండలం పసర పోలీస్ స్టేషన్ నుండి ఎస్సై అచ్చు కమలాకర్ నియమించడం జరిగింది గోవిందపేట మండలం పసర ఎస్సై తెలంగాణ రాష్ట్రంలో ప్రజలకు ఫ్రెండ్లీ పోలీసింగ్ అందుబాటులో ఉన్న సంగతి తెలిసిందే కాగా అందులోనూ అత్యుత్తమ సేవలు కనబరిచిన ఎస్ హెచ్ ఓ ల కొరకు తెలంగాణ రాష్ట్రంలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో ప్రజల అభిప్రాయ సేకరణ చేయగా రాష్ట్రంలోనే టాప్ 10 పోలీస్ స్టేషన్ ఎస్ హెచ్ ఓ లలో ములుగు జిల్లా నుండి పస్ర ఎస్సై కమలాకర్ ఒకరిగా నిలవడం అభినందనీయం ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉంటూ రేయనక పగలనక ఎన్నో సేవలు అందిస్తూ గుడుంబా నియంత్రణ పేకాట నియంత్రణ మత్తు పదార్థాల నియంత్రణ పై ఉక్కు పాదం మోపి నేరాలను అతి తక్కువ సమయంలో చేదించడంలో అత్యుత్తమ ప్రతిభ చూపించినారు మండలంలో ఎలాంటి సమస్య వచ్చిన తానే ముందుండి స్పందించి సమస్యలు పరిష్కరించడంలో ప్రతిభ చూపించినారు ప్రజలతో మమేకమౌతూ ఫ్రెండ్లీ పోలీసింగ్ వ్యవస్థకు మారుపేరులా నిలిచినందుకుగాను పస్ర ఎస్సై కమలాకర్ కు తెలంగాణ రాష్ట్ర డిజిపి జితేందర్ చేతుల మీదుగా ప్రశంస పత్రం అందుకోవడం జరిగింది ఇట్టి విషయమై జిల్లా ఉన్నతాధికారులు తోటి అధికారులు పస్ర ఎస్సై కి అభినందనలు తెలియజేశారు.ఈ సందర్భంగా పస్ర ఎస్సై అచ్చు కమలాకర్ మాట్లాడుతూ తనకు ఎల్లవేళలా అండగా ఉన్న ఉన్నతాధికారులకు తనకు సహకరించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేయడం జరిగింది

## ఆర్‌జికే కాలనీలో రాజీవ్ గాంధీ 34వ వర్ధంతి

- ఘనంగా నివాళులు అర్పించిన ఈగ శ్వేత రాజు ముదిరాజ్



**మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా,మే 21, (పిసిడబ్ల్యూ న్యూస్):**మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా దమ్మాయిగూడ మున్సిపాలిటీ రాజీవ్ గృహ కల్ప కాలనిలో ఉన్న రాజీవ్ గాంధీ విగ్రహానికి 34 వ వర్ధంతి సందర్భంగా పూల మాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు ఈ కార్యక్రమాని కి అధ్యక్షత వహించిన మేడ్చల్ నియోజకవర్గం బి బ్లాక్ మహిళా ప్రెసిడెంట్ మరియు మేడ్చల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఈగ శ్వేత రాజు ముదిరాజ్ మాట్లాడుతు ప్రధానిగా దేశానికే వన్నె తెచ్చిన మహా నాయకుడు రాజీవ్ గాంధీ ఆర్థిక సరళీకృత విధానాలతో దేశాన్ని బలమైన ఆర్థిక దేశంగా నిలబెట్టారు 18 ఏళ్లకే యువతకు ఓటు హక్కును కల్పించి ప్రభుత్వాల ఏర్పాటులో యువతకు భాగస్వామ్యం కల్పించారు అని అన్నరు. ఈ కార్యక్రమం లో దమ్మాయిగూడ మున్సిపల్ మైనారిటీ ప్రెసిడెంట్ యూనిస్ దమ్మాయిగూడ మున్సిపల్ మహిళా వైస్ ప్రెసిడెంట్ సులోచన గౌడ్, సీనియర్ నాయకులు మనోజ్,యువజన నాయకులు మరియు డబల్ బెడ్ రూమ్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు షేక్, ప్రజాపతి మహిళ కాంగ్రెస్ నరసమ్మ, దర్శిని రేష్మ కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులు సీనియర్ నాయకులు పాల్గొనీ కార్యక్రమాన్ని విజయ వంతం చేశారు అనంతరం జై కాంగ్రెస్ జై జై కాంగ్రెస్ అనే నినాదంతో ఈ ప్రాంతం దద్దరిలింది.

## భారత్‌లో సాంకేతిక విప్లవానికి నాంది రాజీవ్ గాంధీ

- ఆ మహనీయుడి సేవలు మరువలేనివి: నీలం మధు ముదిరాజ్
- చిట్కుల్‌లో ఘనంగా రాజీవ్ గాంధీ వర్ధంతి






**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి, మే 21(పిసిడబ్ల్యూ న్యూస్):** దేశానికి సాంకేతికతను తీసుకుని వచ్చి ప్రపంచంలో టెక్నాలజీ విప్లవంలో భారత్ ను నిలిపింది రాజీవ్ గాంధీనేనని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ కంటెస్టెడ్ క్యాండిడేట్ నీలం మధు ముదిరాజ్ అన్నారు.రాజీవ్‌గాంధీ వర్ధంతి ని పురస్కరించుకుని చిట్కుల్లోని ఎన్ఎంఆర్ క్యాంపు కార్యాలయంలో రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో సాంకేతిక విప్లవానికి నాంది పలికింది రాజీవ్ గాంధీనే అన్నారు. అభివృద్ధి చెందుతున్న దేశాల సరసన భారత దేశాన్ని నిలిపిన ఘనత ఆయనదేనని గుర్తుచేశారు. దేశంలో పేదరికాన్ని పారద్రోలి సమసమాజ స్థాపనకు ఆయన చేసిన కృషి ఎప్పటికి మరవలేమని కొనియాడారు.దేశం కోసం తన ప్రాణాలను అర్పించి దేశ ప్రజల గుండెల్లో చిరకాలంగా నిలిచిన ఘనత మహనీయుడు రాజీవ్ గాంధీ సొంతమన్నారు.

## ఘనంగా రాజీవ్ గాంధీ వర్ధంతి వేడుకలు

- సిరోల్ మండల కాంగ్రెస్ అధ్యక్షులు కొండపల్లి కరుణాకర్ రెడ్డి





**సీరోల్, మే 21(పిసిడబ్ల్యూ న్యూస్):** దేశానికి సాంకేతికతను తీసుకువచ్చింది రాజీవ్ గాంధీనేనని సీరోల్ మండల అధ్యక్షులు కొండపల్లి కరుణాకర్ రెడ్డి అన్నారు. రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా బుధవారం రోజున సిరోల్ మండల కేంద్రంలో రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో సాంకేతిక విప్లవానికి నాంది పలికింది రాజీవ్ గాంధీనే అన్నారు. అభివృద్ధి చెందుతున్న దేశాల సరసన భారత దేశాన్ని నిలిపిన ఘనత ఆయనదేనని గుర్తుచేశారు. దేశంలో బీదరికాన్ని పారద్రోలి సమసమాజ స్థాపనకు ఆయన చేసిన కృషి ఎప్పటికి మరవలేమని కొనియాడారు.ఈ కార్యక్రమంలో మహబూబాద్ మార్కెట్ చైర్మన్ ఇస్లావత్ సుధాకర్ మూడు మండలాల కోఆర్డినేటర్ కాలం రవీందర్ రెడ్డి మండల ఉపాధ్యక్షులుగవిని వెంకన్న గంద్ర సత్యం కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు జెర్రీపోతుల మహేష్ భూక్య రాము మహేందర్ రెడ్డి ఆంకోతు సురేష్ నాయక్ విజయ్ భూక్యా సైదులు నాయక్ బాలాజీ గంద సిరి శ్రీను తేజావత్ మంగీలాల్ రాజు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నర్సింగపూర్ పంచాయతీ భవన నిర్మాణానికి భూమిపూజ

**తిమ్మాపూర్,మే21(పీసీడబ్ల్యూ న్యూస్):** నూతనంగా ఏర్పాటయిన అన్ని గ్రామపంచాయతీలకు పక్కా భవనాలు నిర్మిస్తామని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. బుధవారం తిమ్మాపూర్ మండలం నర్సింగపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించతలపెట్టిన పంచాయతీ భవన నిర్మాణ పనులకు ఆయన భూమిపూజ చేశారు. ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ కొత్త పంచాయతీలకు పక్కా భవనాలు నిర్మించాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమని, ఇప్పటికే అనేక గ్రామపంచాయతీలకు కొత్త భవనాల నిర్మాణాలు చేపట్టా మన్నారు. ఆ క్రమంలో నర్సింగపూర్ పంచాయతీ భవన నిర్మాణా నికి మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం



(ఎంజీఎన్ఆర్ఈజీఏ) కింద 20 లక్షల రూపాయలు మంజూరు చేయించినట్టు ఆయన తెలిపారు. నూతనంగా నిర్మిస్తున్న పంచాయతీ భవనాలకు అన్నిహంగులు కల్పిస్తున్నామన్నారు.ఈ కార్యక్రమంలో తిమ్మాపూర్ మండల అభివృద్ధి అధికారి విజయ్ కుమార్. తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డి, ఎంపీవో సురేందర్, పంచాయతీరాజ్ ఏఈ ఎ.సురేందర్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బండారి రమేష్, పోలంపల్లి మాజీ సర్పంచ్ బుడిగె కొండయ్య, పార్టీ నాయకులు మోరపల్లి రమణారెడ్డి, పెరుక రవీందర్, తుమ్మనపల్లి శ్రీనివాసరావు, గంకిడి లక్ష్మారెడ్డి, బుధారపు శ్రీనివాస్, కొత్త తిరుపతి రెడ్డి, మామిడి అనిల్, రెడ్డి గాని రాజు, మెరుగు మోహన్, బి.సంపత్, చిరుతల యాదగిరి, కనకం మొండయ్య, యాదగిరితోపాటు పోలంపల్లి, నర్సింగపూర్ గ్రామాలకు చెందిన పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.



# సాంఘిక సంక్షేమ గురుకులాలను కక్ష్య పూరితంగా భ్రష్టు పట్టిస్తున్న కార్యదర్శి అలుగు వర్షిణి



**● ఐదవ తరగతి అడ్మిషన్లలో తీవ్ర గందరగోళం ● ప్రిన్సిపాల్‌లు ఒక రకంగా, స్టాఫ్ ఒకరకంగా తల్లితండ్రులకు ఆదేశాలు. ● అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్స్ లేకపోతే సీటు క్యాన్సల్ అని బెదిరిస్తున్నట్లు అనుమానం...! ● అక్రమ సంపాదనకు గురుకులాలను అడ్డాలుగా మారుస్తున్న కార్యదర్శి, సిబ్బంది..? ● పరిస్థితులు చక్క దిద్దకపోతే రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు చేపడతాం: టిజిపిఎ రాష్ట్ర కమిటీ అల్టిమేటం**

గత ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న తెలంగాణ గురుకులాల పరిస్థితి ఈ రోజు దీనావస్థలో ఉంది. అయినా పట్టించుకునే నాథుడు లేకపోవడం చాలా దారుణమైన పరిస్థితి.**అడ్మిషన్ల గందరగోళం :** ఈ ఏడాది ఐదవ తరగతిలో ఏ గురుకుల పాఠశాలలో సీటు అలాట్మెంట్ అయిందో ఆయా గురుకుల పాఠశాల సిబ్బంది కాకుండా వేరే గురుకుల పాఠశాల సిబ్బంది సీటు వచ్చిన పిల్లల తల్లిదండ్రులకు ఫోన్ చేసి మా పాఠశాలలో మీ పిల్లలకు సీటు వచ్చిందని చెప్పి ఒరిజినల్ సర్టిఫికెట్స్ తీసుకుని పిల్లలను తల్లిదండ్రులను పాఠశాల నుండి సిబ్బంది పంపించి వేయడం చేస్తున్నారు. కానీ కొన్ని రోజులకు మళ్ళీ అదే సిబ్బంది తల్లిదండ్రులకు ఫోన్ చేసి మీ పిల్లల పేరు మా పాఠశాలలోని డేటా బేస్ లో కనిపించడం లేదు అని చెప్పడంతో తల్లి తండ్రులు భయభ్రాంతులకు గురి అవుతున్నారు. మళ్ళీ సీటు అధికారికంగా ఎక్కడైతే అలాట్మెంట్ అయిందో ఆయా గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ను అడగగా చూస్తాం, చెప్తాం అంటూ కాలయాపన చేస్తున్నారని తల్లి తండ్రులు వాపోతున్నారు. ఇంకా కొంతమంది గట్టిగా మాట్లాడేసరికి ప్రిన్సిపాల్ లు మా వద్దనే మీ పిల్లల సీటు వచ్చిందని, వారి డేటా బేస్ లో చూపిస్తుందని బుకాయించి ఆ తరువాత పిల్లలను జాయిన్ చేసుకుంటున్నారని తల్లి తండ్రులు తెలంగాణ గురుకులాల పేరెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ దృష్టికి తీసుకువచ్చారు. అయితే దీనివెనకాల కార్యదర్శి అలుగు వర్షిణి హస్తం ఉందనేది తల్లి తండ్రులు వాదన,కానీ ఒక అనుమానం ఏంటంటే గురుకుల పాఠశాల సిబ్బంది సీట్లు ఏమైనా అమ్ముకుంటున్నారా... అని అనుమానం కలుగక మానదు.**గురుకులాలను తరలించడం:** 2006 వ సంవత్సరంలో దివంగతనేత వై ఎస్ రాజశేఖర్ రెడ్డి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో మూడు బాల బాలికల ప్రగతిశీల గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేయగా ఒకటి ఆంధ్ర ప్రాంతానికి కేటాయించగా రెండు తెలంగాణ ప్రాంతానికి కేటాయించారు అందులో ఒకటి దక్షిణ తెలంగాణలోని హైదరాబాద్ యందు గల గౌలిదొడ్డి లో ఏర్పాటు చేయగా ఇంకొకటి ఉత్తర తెలంగాణ లోని కరీంనగర్ యందు గల అల్గునూరు లో ఏర్పాటు చేయడం జరిగింది. కానీ కొన్ని అనివార్య కారణాల చేత బాలికలకు ఆ రెండు క్యాంపస్ లు కేటాయించి బాలురను మాత్రం వేర్వేరు ప్రాంతాల్లో గల గురుకులాల్లోకి తరలించడం చాలా దారుణం అలాగే ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా కార్యదర్శి అలుగు వర్షిణి పని చేస్తోందనడాని ఇదే నిదర్శనం. ఇదే కనక జరిగితే కొన్ని వందల మంది పేద, దళిత బాల బాలికలు ఉన్నత విద్య కు పూర్తిగా దూరమై పోతారు. ఈ చర్య ఖచ్చితంగా కార్యదర్శి అలుగు వర్షిణి కక్ష్య పూరితంగా ప్రభుత్వం విధానాలకు వ్యతిరేకంగా పని చేస్తుందని తెలపకనే తెలియచేస్తుంది.తెలంగాణలోని ఈ రెండు ప్రగతిశీల గురుకుల కళాశాలల్లో చదువుతున్న కొన్ని వందల మంది దళిత బాల బాలికలు దేశంలోనే అత్యంత ప్రతిష్టాత్మక విద్యా సంస్థలు అయినటువంటి అజీమ్ ప్రేమజీ యూనివర్సిటీ, అశోక యూనివర్సిటీ, ఢిల్లీ యూనివర్సిటీ, అలాగే ప్రపంచ అత్యుత్తమ విద్యా సంస్థ అయినటువంటి హార్వర్డ్ యూనివర్సిటీ లలో సీట్లు సాధించడం కొంత మంది అగ్రకుల ప్రభుత్వ అధికారులకు మింగుడు పడటం లేదని, కొంత అగ్రకుల అహంకారంతో దళిత పిల్లల చదువును అడ్డుకోవడానికే ఇలాంటి చర్యలు చేపట్టారు అని సుస్పష్టంగా అర్థం చేసుకోవచ్చు.**ఇది ఇలాగే కొనసాగితే :** ఇది ఇలాగే కొనసాగితే రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నటువంటి గురుకులాల పేరెంట్స్ అందరితో కలిసి అసోసియేషన్ ఆద్వర్యంలో నిరసనలు చేపడతాం అని తెలంగాణ గురుకులాల పేరెంట్స్ అసోసియేషన్ హెచ్చరించడం జరిగింది.**వృత్తి విద్య కోర్సుల ఎత్తివేత.** రాష్ట్రంలోని కొన్ని గురుకుల కళాశాలల్లో ఏర్పాటు చేసిన వృత్తి విద్యా కోర్సులను బోధించుటకు తగిన సిబ్బంది లేదనే సాకుతో వాటిని కూడా ఎత్తివేస్తున్నట్లు సమాచారం ఉంది. ఒకవేళ అదే జరిగితే ఉన్నత విద్యను అభ్యసించలేని కొంత మంది కడు పేద విద్యార్థులకు అన్యాయం చేసినవారే అని కోపోద్రిక్తులౌతున్న తల్లితండ్రులు. ఈ చర్యలు మానుకోవాలని వారు హెచ్చరిస్తున్నారు.**పక్షపాత వైఖరిని ప్రదర్శిస్తున్న కార్యదర్శి అలుగు వర్షిణి.** జ్యోతిభాపూలే బి సి, మైనారిటీ, జనరల్, ట్రైబల్ గురుకుల పాఠశాలలో పదవతరగతి పరీక్షలో ఉత్తీర్ణులు కానీ విద్యార్థులకు, ఇంప్రూవ్మెంట్ పరీక్షలు రాసే విద్యార్థులకు సప్లిమెంటరీ పరీక్షలకు బస్ సౌకర్యం, భోజన వసతులు, నివాస సదుపాయం కల్పిస్తున్నారు. కానీ సాంఘీక సంక్షేమ గురుకులాల విద్యార్థులకు మాత్రం పక్షపాత వైఖరి ప్రదర్శిస్తున్న కార్యదర్శి. తక్షణమే వారి సిబ్బందికి ఆదేశాలిచ్చి మిగతా గురుకులాల కార్యదర్శులు విద్యార్థులకు కల్పించిన వసతులు కల్పించాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ను కలిసి తెలంగాణ గురుకులాల పేరెంట్స్ అసోసియేషన్, జై భీమ్ యూత్ ఇండియా సంయుక్తం గా వినతి పత్రం అంద చేయడం జరిగింది.

# గంధంపల్లి-కొత్తపేటలో గుప్పుమంటున్న గాంజా వాసన...!

**● బానిసలై...! పెడదారి పడుతున్న యువత..!**

**● కట్టడి చేయలేకపోతున్నాం బాబు అంటూ...!**

**● లబో..దిబో..మంటున్న యువత తల్లిదండ్రులు...!**



**బయ్యారం,మే 21(పిసిడబ్ల్యూ న్యూస్):** పిల్లలకు అతిగారాబంగా కంటే, క్రమశిక్షణ ముఖ్యం.అవి లోపిస్తే యువత హద్దు మీరి ప్రవర్తిస్తారు.అతి గారాబం యువత తల్లిదండ్రుల ప్రాణాల మీదకు కొన్ని కొన్ని సందర్భాల్లో ప్రాణ సంకటాలు తీసుకొని వస్తుంటాయి. మత్తు పదార్థాలకు అలవాటై యువత వారి తల్లిదండ్రులను లెక్కచేయకుండా ఇల్లు, వళ్ళు గుల్ల చేసుకుంటున్నారు. వాటిని నియంత్రించడం ప్రభుత్వాలు, చైతన్యవంతులు, అధికారులు అనేక చర్యలు తీసుకుంటున్న ఫలితం అంతంత మాత్రం గాని ఉంటుంది అన్నది నిజం. వివరాల్లోకి వెళితే మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలంలోని గంధంపల్లి-కొత్తపేట పంచాయతీ పరిధిలో కోటగడ్డ చుట్టుపక్క పరిసర గ్రామాలలో 50 నుండి 100 మంది యువత నిత్యం గాంజా మత్తులో ఉంటున్నారని ఆరోపణలు ఉన్నాయి. ఉదయం లేవగానే మత్తుకు బానిస అయిన యువత గాంజాను సేవిస్తూ ఇంటి వద్ద ఉన్న తల్లిదండ్రులను బెదిరిస్తూ,వారి వద్ద నుండి బలవంతంగానైనా,వారిపై దాడి చేస్తూ,డబ్బులు ఇవ్వకుండా ఉంటే బూతు తిడుతు వారి నుండీ డబ్బులను లాగేసుకుంటున్నారు. కొంతమంది గాంజా వ్యాపారులు యువతను ఆకర్షించి మత్తు పదార్థాలకు అలవాటు చేసి వారి నుండి అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేస్తూ ఈ గాంజా వ్యాపారాన్ని మూడు పువ్వులు ఆరు కాయలుగా గంధంపల్లి-కొత్తపేట పరిసర గ్రామాలలో విస్తరిస్తున్నారు.మత్తుకు బానిసలైన యువత దాని నుండి తేరుకోకపోవడంతో తల్లిదండ్రులపై భారం పడుతూన్నట్లు సమాచారం.దీనిని ఎక్కడ బయట పెడితే మా పిల్లల భవిష్యత్తు ఆగమవుతుందో అని కొట్టుమిట్టాడుతూ ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాక తల్లిదండ్రులు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.పట్టణ ప్రాంతాల నుండి గంధంపల్లి-కొత్తపేటకు గాంజా సప్లై చేసే కొంత మంది కార్ డ్రైవర్స్ ఈ వ్యవహారం నడిపిస్తున్నట్లు యువత తల్లిదండ్రులు బహిరంగంగానే చర్చించుకోవడం కోసమెరుపు.

**నిఘా వ్యవస్థలపై నీలి నీడలు ..!**

అక్రమ గాంజా వ్యాపారం నిర్వహించే వారిని పసిగట్టి పట్టుకోవలసిన అధికారులే మౌనం వహించడం వల్ల పెద్ద ఎత్తున యువత గాంజా మత్తులో ఉంటున్నట్లు తెలుస్తుంది.గాంజాను ఇతర ప్రాంతాల నుండి రవాణా చేసే వారిని అడపాదడపా పట్టుకున్నట్లు అధికారులు చెబుతున్న అంత పగడ్బందీగా గంజాని అరికట్టలేకపోతున్నట్లు తెలుస్తుంది.నిఘా వ్యవస్థ లోపాల వల్లనే గాంజా అక్రమ వ్యాపారం గంధంపల్లీ- కొత్తపేటలో జోరుగా సాగుతున్నట్లు జనాలు చర్చించుకుంటున్నారు.

**గాంజా మత్తును అరికట్టేందుకు**

**అధికారులు చర్యలు శూన్యం...?**

యువత పెడదారి పట్టకుండా అధికారులు,ప్రభుత్వాలు గంజాయి నివారణకు గ్రామాలలో అవగాహన సదస్సులు,సమావేశాలు నిర్వహించాల్సి ఉండగా, ఎక్కడ కూడా అవి నిర్వహించడం లేదని ఆరోపణలు ఉన్నాయి.పోలీస్ స్టేషన్లో అధికారులు కేసులు వస్తే,ఎఫ్ ఐ ఆర్ లు చేయడం, కేసులు కట్టడం అంతవరకే తమ పనులు ముగించుకొని కాలం గడుపుతున్నారని ఆరోపణలు ఉన్నాయి.నిత్యం ప్రజా క్షేత్రంలో ఏమి జరుగుతుందో తెలుసుకునే తీరిక లేకుండా ఉన్నారనే ఆరోపణలు ఉన్నాయి.గాంజా మత్తు నుండి యువత చిత్తుకాకముందే దీనిపై నిఘా వ్యవస్థను అప్రమత్తం చేసుకొని గాంజా ఎక్కడి నుంచి వస్తుంది,ఎవరు సప్లై చేస్తున్నారు,అనే విషయాలపై ముమ్మర దర్యాప్తు చేసి అరికట్టవలసిన అధికారులు మౌన నిద్రలో జోగుతున్నారు.యువత మత్తులో ఉండటంతో గతంతో పోలిస్తే నేడు అధిక నేరాలు యువతతోనే జరుగుతున్నాయి.దీనితో బాధిత కుటుంబాలు అనేక ఇబ్బందులు పడుతూ విల విలాడుతున్నాయి.ఇప్పటికైనా గాంజా మత్తు పదార్థాలను సప్లై చేసే వారిని గుర్తించి కట్టడి చేయాలని,వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకొని,గ్రామాలకు గాంజా రవాణా కాకుండా చూడాలని పలువురు వేడుకుంటున్నారు. డి.ఎస్.పి తిరుపతిరావు ను వివరణ కోరగా గాంజా మరియు ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని మీడియా పరంగా మరియు ప్రత్యక్ష కార్యక్రమాలు కొంతమేర నిర్వహించామని మా దృష్టికి ఇలాంటి సంఘటనలు తీసుకురాలేదని అన్నారు. కన్న తల్లిదండ్రులు ఈ అతి ప్రేమ వల్ల ఆర్థికంగా, ప్రాణ సంకటనలు వారికి వారే తెచ్చుకున్న సంఘటనలు అనేకం సమాజంలో జరుగుతున్నాయని కచ్చితంగా గాంజా, మత్తు పదార్థాలు, బెట్టింగ్లపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# ప్రభుత్వం ఎంతో చెయ్యాలని ఉన్న నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అదికారులు

**● మంత్రి దామోదర్ రాజనరసింహ ఫైర్**



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి, మే 21(పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకులాల కార్యదర్శి శ్రీమతి అలుగు వర్షిని ఇష్టానుసారంగా గురుకులాలను నడుపుతూ, పేద దళిత విద్యార్థుల కోసం గురుకులాలు అందిస్తున్న అనేక కోర్సులను తొలగిస్తూ, గురుకులాలలో ఏలాంటి తనిఖీలు లేకుండా కింది స్థాయి అధికారులతో ఇష్టానుసారంగా పరిపాలన సాగిస్తూ ప్రభుత్వం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సర్కార్కు చెడ్డ పేరు వచ్చే విధంగా పనిచేస్తున్నారు. బీసీ మైనారిటీ గురుకులాలలో కల్పిస్తున్న సౌకర్యాలను కూడా కావాలని ఉద్దేశపూర్వకంగా ఎస్సీ విద్యార్థులకు కల్పించకుండా కుట్రలు చేస్తున్న సెక్రటరీ పై ఉద్యమ సూర్యులు, నిరంతరం పేదలకై, పేద విద్యార్థులకై పరితపించే అలుపెరగని పోరాటయోధులు ముకురాల శ్రీహరి, చెరుకూరి రాజ్ , తెలంగాణ గురుకులాల పేరెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధికార ప్రతినిధి అంబాల కిరణ్ కుమార్ తదితరులు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహను మినిస్టర్స్ క్వార్టర్స్ లో కలిసి వినతి పత్రం అందచేశారు. అందుకు సానుకూలంగా స్పందించిన మంత్రి వెంటనే సెక్రెటరీ అలుగు వర్షిణి కి ఫోన్ చేసి ఫైర్ అయిన మంత్రి, తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు.

# ఎన్కౌంటర్‌లో మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు మృతి

**● పాతిక మందికి పైగా మావోయిస్టులను ఎన్కౌంటర్ చేసిన ఫాసిస్టు మనువాద సర్కార్**

**● ఫహల్గామ్"ఉగ్రవాద"నేరస్తుల ఉనికిని సైతం పసిగట్టి శిక్షించలేని పాలకులు**

**● ఈ దేశ ఆదివాసీ పేదల కోసం పనిచేస్తున్న మావోయిస్టుల్ని హత్య చేసి గర్వంగా ప్రకటన ఇవ్వడం ఫాసిస్టు నీతికి నిదర్శనం!**









**హైదరాబాద్ మే 21 (పిసిడబ్ల్యూ న్యూస్ (ప్రతినిధి):** గత కొన్ని రోజులుగా మధ్యబరత అడవిలో బీజేపీ ప్రభుత్వం "ఆపరేషన్ కగార్"పేరుతో హత్యా కాండను కొనసాగిస్తుంది. ఈరోజు చెత్తిస్ ఘడ్ అడవిలో 30 మంది నక్సల్స్ ను కాల్చి చంపడం బీజేపీ ,ఆర్ఎస్ఎస్, బ్రాహ్మణీయ మనువదుల కుట్రలను బహిర్గత పరుస్తూ.. పేదల హక్కుల కోసం తమ జీవితాలనే త్యాగం చేస్తూ పేదల పక్షాన పోరాడుతున్న విప్లవ కారులను పొట్టన పెట్టుకొంటున్న ఈ దళారి ప్రభుత్వంను కూల్చేందుకు దేశంలోని వామపక్ష,ప్రజాతంత్ర,అంబేద్కర్ వాదులు ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలన్నారుఅడవిలో ఉన్న అపారమైన ఖనిజ, సంపదను,బాక్సైట్,ముడిసరుకు, అదానీ,అంబానీ,బిర్లా,విదేశీ కార్పొరేట్ కంపనీల కోసమే ఈ హత్యలు రాజ్యహింసలో భాగమే అని బీజేపీ, ఆర్ఎస్ఎస్ బ్రాహ్మణీయ మనువదుల రాజ్యానికి వెతిరేకంగా ఉద్యమలు నిర్మించాలని మల్లేపల్లి ప్రభాకర్ ఒక ప్రకటనలో కోరారు.ఇప్పటికైనా నక్సల్స్ తో శాంతి చర్చలు జరపాలని కేంద్ర సర్కారును డిమాండ్ చేసిన :మల్లేపల్లి ప్రభాకర్ సిపిఐ ( యమ్ ఎల్) సి పి రెడ్డి పార్టీ కార్యదర్శి

# ఉగ్రవాద నిర్మూలనే మోదీ సర్కార్ లక్ష్యం...

- ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా అంతమొందించాల్సిందే.
- పెహల్గాం ఘటన తరువాత దేశ ప్రజల్లో చాలా మార్పు వచ్చింది.
- ఉగ్రవాద నిర్మూలనకు యుద్ధంలో పాల్గొనేందుకు ప్రజలు సిద్ధమయ్యారు.
- ఉగ్రవాద శిబిరాల ధ్వంసంతో దేశ సైనిక సత్తా ప్రపంచానికి తెలిసింది.

- కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ వ్యాఖ్యలు.
- యాంటీ టెర్రరిజం డే ర్యాలీని ప్రారంభించిన కేంద్ర మంత్రి...







**కరీంనగర్,మే21(పీసీడబ్ల్యూ న్యూస్):** ఉగ్రవాదాన్ని సమూలంగా నిర్మూలించడమే నరేంద్రమోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా పనిచేస్తోందని కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తెలిపారు. పెహల్గాం ఘటన తరువాత దేశ ప్రజల్లో చాలా మార్పు వచ్చిందన్నారు. ఉగ్రవాద నిర్మూలన కోసం జరిగే యుద్ధంలో అవసరమైతే సామాన్య ప్రజలు కూడా పాల్గొనేందుకు సిద్ధమయ్యారన్నారు. పాకిస్తాన్ భూభాగంలోకి వెళ్లి అక్కడి ప్రజల ప్రాణాలకు ఇబ్బంది లేకుండా ఉగ్రవాద శిబిరాలను ధ్వంసం చేయడంతోపాటు ఉగ్రవాదులను మట్టుబెట్టిన ఘనత భారత సైన్యానిదేనన్నారు. 'ఉగ్రవాద వ్యతిరేక దినం' :- సందర్భంగా కరీంనగర్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కరీంనగర్ ర్యాలీ నిర్వహించారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ ఈ సందర్భంగా జెండా ఊపి ర్యాలీని ప్రారంభించి మాట్లాడారు.

ఈ సందర్భంగా కేంద్ర మంత్రి ఏమన్నారంటే..... ప్రపంచంలో టెర్రరిజాన్ని అణిచివేసే శక్తి సామర్థ్యాలు భారత్ కు ఉన్నాయనే విషయాన్ని ప్రపంచమంతా గుర్తించింది. పెహల్గాం ఘటన అనంతరం భారత సైన్యం టెర్రరిస్టుల స్థావరాలను గుర్తించి ధ్వంసం చేయడంతోపాటు ఉగ్రవాదులను మట్టుబెట్టిన మన సైన్యం ధైర్య సాహసాలను చూశాం.పాకిస్తాన్ టెర్రరిస్టులకు అడ్డాగా మారింది. టెర్రరిస్టులను ప్రోత్సహిస్తూ ఆ దేశం ఆర్థిక సాయం చేస్తోంది. నరేంద్రమోదీ ప్రభుత్వం ఈ విషయాన్ని గుర్తించి ఆ దేశంలోని ఉగ్రవాద శిబిరాలను ధ్వంసం చేయడం జరిగింది. ముంబయి పేలుళ్లు, లుంబినీ పార్క్, గోకుల్ ఛాట్ పేలుళ్లు, మక్కా మసీదు పేలుళ్ల తరువాత దేశ ప్రజల్లో మార్పులు వచ్చాయి. అవసరమైతే దేశం పక్షాన టెర్రరిజంపై యుద్ధం చేసేందుకు సిద్దంగా ఉండటం సంతోషకరం. పాకిస్తాన్ భారత సరిహద్దు ప్రాంతాల్లో సామాన్య ప్రజలను, వారి ఆవాసాలను టార్గెట్ చేసి ధ్వంసం చేయాలనుకుంది. టెక్నాలజీని ఉపయోగించుకుని వాటిని తిప్పికొట్టిన ఘనత మన సైన్యానిదే. మోదీ నాయకత్వంలో అమిత్ షా సారధ్యంలో టెర్రరిజం ఏ రూపంలో అంతం చేసేందుకు చర్యలు తీసుకుంటోంది. సామాన్య ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు, రాష్ట్ర ప్రభుత్వాలు దేశ సైన్యానికి మద్దతుగా నిలవడం దేశ భక్తికి నిదర్శనం. చిన్నా పెద్దా ముసలి ముతక తేడా లేకుండా టెర్రరిజం అంతం కోసం ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి. ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా మట్టుపెట్టాల్సిందే. ఇందులో మరో ఆలోచనే లేదు. యాంటీ టెర్రరిజం డే సందర్భంగా జిల్లా క్రికెట్ సంఘం వాళ్లు ముందుకొచ్చి ర్యాలీ నిర్వహించడం సంతోషంగా ఉంది.

# సుడా నిధులతో రాజీవ్ గాంధీ కాంస్య విగ్రహ ఏర్పాటుకు శంకుస్థాపన

- ఘనంగా రాజీవ్ గాంధీ వర్ధంతి వేడుకలు
- శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కవ్వంపల్లి, సుడా చైర్మన్ కోమటిరెడ్డి, మున్సిపల్ కమీషనర్ చాహత్ బాజ్ పాయ్
- డిసిసి కార్యాలయంలో రాజీవ్ గాంధీ వర్ధంతి వేడుకలు..ఘన నివాళులు అర్పించిన కాంగ్రెస్ నేతలు



**కరీంనగర్ టౌన్, మే 21(పిసిడబ్ల్యూ న్యూస్):** మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా నేడు కరీంనగర్ డిసిసి కార్యాలయంతోపాటు నగరంలోని రాజీవ్ చౌక్ వద్ద కార్యక్రమాలు ఘనంగా నిర్వహించడం జరిగింది.మొదట నగర కాంగ్రెస్ ఆధ్వర్యంలో రాజీవ్ చౌక్ వద్ద నిర్వహించిన రాజీవ్ గాంధీ వర్ధంతి కార్యక్రమానికి మానకొండూరు ఎమ్మెల్యే కరీంనగర్ డిసిసి అధ్యక్షులు డా.కవ్వంపల్లి సత్యనారాయణ హాజరై, సుడా చైర్మన్ నగర కాంగ్రెస్ అధ్యక్షులు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి 15లక్షల రూపాయల సుడా న్నిధులతో త్వరలో ఏర్పాటు చేయనున్న రాజీవ్ గాంధీ కాంస్య విగ్రహానికి శంకుస్థాపన చేయడం జరిగింది.ఈ కార్యక్రమానికి నగర మున్సిపల్ కమిషనర్ చాహత్ బాచ్ పేయ్ హాజరై కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన కార్యక్రమాన్ని ప్రారంభించినారు.అనంతరం ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, పిసిసి కార్యదర్శి వైద్యుల అంజన్ కుమార్, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, మాజీ హౌస్ పెయిడ్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తితో పాటు పలువురు కాంగ్రెస్ నేతలతో కలిసి రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలు వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ... మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ ఈ దేశంలో సాంకేతిక విప్లవానికి పునాదులు వేసిన గొప్ప వ్యక్తి అని, ఆనాడు ఎల్టిటి తీవ్రవాదుల బెల్టు బాంబుకు బలై ప్రాణాలు వదిలిన రాజీవ్ గాంధీని వారి కుటుంబ త్యాగాలను ప్రతి పౌరుడు నేటికీ స్మరించుకుంటున్నారని, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి15 లక్షల రూపాయల సుడా నిధులతో త్వరలో రాజీవ్ గాంధీ కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ఆలోచన చేయడంఅభినందనీయమని, రాజీవ్ గాంధీ కన్న కలలను సాకారం చేయడానికి ప్రతి కాంగ్రెస్ పార్టీ కార్యకర్త కృషి చేయాలని, నేడు దేశంలో మతం పేరుతో కొన్ని పార్టీలు చేస్తున్న రాజకీయాల వల్ల దేశంలో అమాయక ప్రజలు తమ ప్రాణాలు కోల్పోవలసి వస్తుందని ఇటీవల కాశ్మీర్లో తీవ్రవాదుల తూటాలతో అమాయకులు ప్రాణాలు కోల్పోవడమే ఇందుకు నిదర్శనమని, ఇలాంటి మత తత్వ శక్తుల నుండి ఈ దేశాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత కాంగ్రెస్ పార్టీపై ఉందని అన్నారు.సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ... 30 సంవత్సరాల క్రితం నాటి కాంగ్రెస్ నాయకులు నగేష్ ముదిరాజ్ రాజీవ్ గాంధీ విగ్రహం ఏర్పాటు చేయడం గొప్ప విషయమని, కానీ కాలానుగుణంగా దెబ్బతిన్న ఆ విగ్రహ స్థానంలో కొత్తగా కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించి త్వరలోనే జిల్లా మంత్రులు దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ సూచన మేరకు పెద్ద ఎత్తున రాజీవ్ గాంధీ కాంస్య విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంతో పాటు నెహ్రు విగ్రహాన్ని ఏర్పాటు చేసుకుందామని ఇందుకు సంబంధించి ఏర్పాట్లు జరుగుతున్నాయని అన్నారు.అనంతరం డిసిసి కార్యాలయంలో ఏర్పాటు చేసిన రాజీవ్ గాంధీ చిత్రపటానికి ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, డిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, పిసిసి కార్యదర్శి వైద్యుల అంజన్ కుమార్, జిల్లా కాంగ్రెస్ అనుబంధ సంఘాల అధ్యక్షులు పులి ఆంజనేయులు గౌడ్, శ్రావణి నాయక్, కోర్వి అరుణ్ కుమార్ తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించి రాజీవ్ గాంధీ సేవలను కొనియాడినారు.ఈ కార్యక్రమాలలో ఆరేపల్లి మోహన్, కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, గడ్డం విలాస్ రెడ్డి, పులి ఆంజనేయులు గౌడ్, శ్రావణ్ నాయక్, వెన్న రాజమల్లయ్య, నిహాల్, అహ్మద్, ఎండి అజీమ్, కామరెడ్డి రామ్ రెడ్డి, కలువల రాంచందర్, వంగల విద్యాసాగర్, నాగుల సతీష్, అహమ్మద్ అలీ, కుర్ర పోచయ్య, ఆకుల నరసయ్య, మామిడి సత్యనారాయణ రెడ్డి, మహమ్మద్ చాంద్, ఆనంద్ కుమార్, కుంబాల రాజకుమార్, జీడి రమేష్, ములకల కవిత, యోనా వెన్నం, రజిత రెడ్డి, జ్యోతి రెడ్డి, వాసాల రవీందర్, హస్త పురం తిరుమల, ముస్తాక్, జొన్నల రమేష్, ఎలగందుల మల్లేశం, మేతరి శ్రీనివాస్, బత్తిని చంద్రయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# కేసీఆర్‌కి నోటీసులు... కాంగ్రెస్ కక్ష సాధింపు చర్యలకు పరాకాష్ట

- తెలంగాణ ఆత్మగౌరవానికి గొడ్డలిపెట్టు
- ఘాటుగా ఖండించిన ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి



తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావుకి, మాజి మంత్రి హరీష్ రావుకి నోటీసులు జారీ చేయడం కాంగ్రెస్ కక్ష సాధింపు చర్యలకు పరాకాష్ట అని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి తీవ్రంగా ఖండించారు.ప్రజాస్వామ్యంలో ఎదుగుతున్న నాయకులను, ప్రజల గుండెల్లో స్థానం సంపాదించిన నాయకులను ఇలా వేధించడం దారుణమన్నారు. విశ్వఖ్యాతి గాంచిన కాళేశ్వరం ప్రాజెక్టుతో కేసీఆర్కి వచ్చిన ఖ్యాతిని, ప్రజల్లో ఏర్పడిన గౌరవాన్ని జీర్ణించుకోలేక కాంగ్రెస్ ప్రభుత్వం ఇలా కక్ష తీర్చుకుంటోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.ఏం నేరం చేశారని కేసీఆర్ ని వెంటబడ్డారు?" అని ఆయన నిలదీశారు. తెలంగాణ కోసం ప్రాణాలను పణంగా పెట్టి పోరాడినందుకా? రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేసిన వరప్రదాయిని 'కాళేశ్వరం' కట్టినందుకా? కోటి ఎకరాలకు సాగు నీరు ఇచ్చినందుకా? రైతుబంధు, రైతు బీమా, ఉచిత విద్యుత్ తో రైతును రాజును చేసినందుకా ?మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ మంచినీరు ఇచ్చినందుకా? కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ ద్వారా పేదింటి ఆడపిల్లల పెండ్లిళ్లు చేసినందుకా? రూ.2000 ఫించన్‌ను రూ.3 వేలకు పెంచినందుకా? వెయ్యికి పైగా గురుకుల పాఠశాలలు స్థాపించినందుకా? అద్భుతంగా సెక్రటేరియట్ నిర్మించినందుకా? 33 మెడికల్ కాలేజీ తీసుకొచ్చి కట్టించినందుకా ? ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందించినందుకా?ఇవి నేరాలైతే, వాటిని ఖచ్చితంగా మేము మళ్ళీ చేస్తాం అని కౌశిక్ రెడ్డి స్పష్టం చేశారు. కేసీఆర్ పాలనలో ఉద్యోగులకు 73% ఫిట్‌మెంట్, తెలంగాణ ఇంక్రిమెంట్, కేసీఆర్ కిట్, మిషన్ కాకతీయ కింద చెరువుల పునరుద్ధరణ, చెక్‌డ్యాంలు, బతుకమ్మ చీరల పంపిణీ, పండుగల కానుకలు, యాదాద్రి ఆలయ పునర్నిర్మాణం, కమాండ్ కంట్రోల్ సెంటర్ నిర్మాణం ు ఇవన్నీ ప్రజల మనసుల్లో చెరగని ముద్ర వేసిన అభివృద్ధి చిహ్నాలు అన్నారు.విచారణల పేరుతో వేధిస్తే తెలంగాణ ప్రజలు ఊరుకోరు అని ఆయన హెచ్చరించారు.కరోనా వంటి ప్రపంచ విపత్తులోనూ ప్రజల మధ్య ఉండి ధైర్యం ఇచ్చిన నాయకుడు కేసీఆర్ గారు. అలాంటి మహానేతను కించపరచాలన్న యత్నాలు తెలంగాణ ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడమే. ఇది తట్టుకోదగిన విషయం కాదు అని అన్నారు.రేవంత్ రెడ్డి సర్కార్ తాటాకు చప్పుళ్లకు భయపడేది బీఆర్ఎస్ కాదు.కొరివితో వీపు గోక్కున్న చందాన కేసీఆర్ తో గోక్కున్నోళ్లెవరు బాగుపడలేరు.కాంగ్రెస్ పార్టీ తగిన మూల్యం చెల్లించక తప్పదు, అని కౌశిక్ రెడ్డి ఘాటుగా హెచ్చరించారు.ఎన్నికల ముందు ఇచ్చిన 420 హామీలను అమలు చేయలేని దౌర్భాగ్యాన్ని ప్రజల దృష్టి నుండి మళ్లించేందుకు కేసీఆర్ కి నోటీసుల పేరుతో డ్రామాలు ఆడుతున్నారు.కానీ ప్రజలు చూస్తున్నారు ఈ కుట్రలన్నీ ఒక్కరోజు విడిచిపెట్టబడవు.తెలంగాణ ప్రజలు కాంగ్రెస్‌కు తగిన బుద్ధి చెబుతారు, అని పాడి కౌశిక్ రెడ్డి స్పష్టం చేశారు.



## నూతన తహసిల్దార్ రమేష్ బాబును కలిసిన బిజెపి నాయకులు

**నర్సింహులపేట,మే21(పీసీడబ్ల్యూ న్యూస్):**నరసింహుల పేట మండల తహసిల్దారుగా నూతన బాధ్యతలు చేపట్టిన తాసిల్దార్ రమేష్ బాబును బిజెపి మండల అధ్యక్షులు సురబోయిన సతీష్ యాదవ్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి సాలువతో సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల బిజెపి అధ్యక్షులు సురబోయిన సతీష్ యాదవ్ తో పాటు జిల్లా కౌన్సిల్ సభ్యులు గండి రమేష్, మండల ప్రధాన కార్యదర్శి మెరుగు యాకయ్య, మండల ఉపాధ్యక్షులు నెలకుర్తి సత్యనారాయణ రెడ్డి, బూత్ కమిటీ అధ్యక్షుడు కాలు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## జేడీ లక్ష్మీనారాయణ స్వాగతం పలికిన కప్పల రవికుమార్ గౌడ్ (పరిటాల)

**- సర్దార్ సర్వాయి పాపన్న గీత కార్మిక సంఘం యాదాద్రి జిల్లా అధ్యక్షులు**



**రామన్నపేట మే21(పీసీడబ్ల్యూ న్యూస్):**మాతృదేవోభవ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన రక్తదాన కార్యక్రమానికి హాజరైన రామన్నపేట మండలానికి చెందిన సర్దార్ సర్వాయి పాపన్న గీత కార్మిక సంఘం యాదాద్రి జిల్లా అధ్యక్షులు కప్పల రవికుమార్ గౌడ్ (పరిటాల) కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జేడీ లక్ష్మీనారాయణకి బొకే ఇచ్చి స్వాగతం పలికినారు యువత లక్ష్మీనారాయణ సలహాలు సూచనలు పాటించి ఉన్నత స్థాయి ఉద్యోగాలు పొందాలని తెలిపినారు రక్తదానం పదిమంది ప్రాణాలు కాపాడుతుందని తెలిపినారు

## రాజీవ్ సేవలు మరువలేనివి..

**- బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఎదళ్ల యాదవ రెడ్డి..**



**నెల్లికుదురు,మే21(పీసీడబ్ల్యూ న్యూస్):**దేశానికి ఇన్ఫర్మేషన్ అండ్ టెక్నాలజీ కి రాజీవ్ గాంధీ చేసిన సేవలు మరవలేనివని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఎదళ్ల యాదవ రెడ్డి రాజీవ్ సేవలను కొనియాడారు.బుదవారం స్థానిక విశ్రాంతి భవనంలో రాజీవ్ గాంధీ 34వ వర్ధంతి ఘనంగా నిర్వహించారు.రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలవేసి వేసి ఘనంగా నివాళులు అర్పించారు.అనంతరం జరిగిన సమావేశంలో యాదవ రెడ్డి, మాజీ జడ్పీటీసీ హెచ్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ,యువతకు ఐటీ రంగంలో ఉపాధి కల్పించడంలో అని రాజీవ్ పాత్ర కీలకమైనదని 18 సంవత్సరంలో ఓటు హక్కు కల్పించి, మహిళలకు చట్టసభలో స్థానం72,73 వ రాజ్యాంగ సవరణలు ప్రపంచ దేశాలలో భారత ప్రతిష్టను పెంచడంలో రాజీవ్ సేవలు మరువలేనివన్నారు. మండల పార్టీ అధ్యక్షులు గొల్లపల్లి ప్రభాకర్ గౌడ్.నెల్లికుదురు టౌన్ అధ్యక్షులు రత్నాపురపు యాకయ్య.నాయకులు పట్నం శెట్టి నాగరాజు.వలబోజు వెంకటేశ్వర్లు.కొమురెల్లి యాదవ్,చట్ల యాకయ్య,దండేపల్లి సైదులు,మట్టా యాకూబ్ రెడ్డి,భాస్కర్ శ్రీను, పాల్గొన్నారు.

## పోస్టుమెట్రిక్ స్కాలర్షిప్ కొరకు దరఖాస్తుల ఆహ్వానం

**- జిల్లా షెడ్యుల్ కులముల అభివృద్ధి శాఖ అధికారి ఎం నరసింహమూర్తి**



**మహబూబాబాద్ మే21(పీసీడబ్ల్యూ న్యూస్):** 2024- 25 సంవత్సరానికి గాను మహబూబాబాద్ జిల్లాలో చదువుతున్న ఎస్సీ /ఎస్టీ/ బీసీ/ ఓసి/ఈ బి సి విద్యార్థులు పోస్టుమెట్రిక్ స్కాలర్షిప్ కొరకు ఆఖరి తేదీ 31. 05.2025 ఉన్నందున www.telan-ganaepass.cgg.gov.in వెబ్సైట్లో దరఖాస్తు చేసుకోగలరని జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ అధికారి ఎం. నరసింహస్వామి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

# మార్నింగ్ వాక్‌లో దర్గాను సందర్శించిన ఎమ్మెల్యే

**• దర్గా పెద్దలతో కలిసి ప్రత్యక ప్రార్థనలు...**







**అల్గునూరు,మే21(పీసీడబ్ల్యూ న్యూస్):**మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ బుధవారం మార్నింగ్ వాక్ లో భాగంగా తీగల వంతెన సమీపంలోని హజరత్ సయ్యద్ షేర్ అలీ బాబా దర్గాను సందర్శించారు. ఈ సందర్భంగా ముస్లిం పెద్దలు, దర్గా కమిటీ బాధ్యులతో కలిసి ఆయన ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్నారు. అనంతరం దర్గా కమిటీ అధ్యక్షుడు వాజిద్ అలీతో కలిసి అన్యాక్రాంతానికి గురైన దర్గా భూమిని ఎమ్మెల్యే పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అన్యాక్రాంతానికి గురైన దర్గా భూమిని దర్గాకే చెందేట్లు చొరవ తీసుకుంటానని హామీ ఇచ్చారు.ఆక్రమణకు గురైన దర్గా భూమి విషయంలో సర్వే చేయించి ఆ భూమి తిరిగి ఇప్పించేందుకు కృషి చేస్తానన్నారు. రెవెన్యూ రికార్డుల ప్రకారం దర్గా భూమి ఎంత ఉందో తేల్చాలని తిమ్మాపూర్ తహసిల్దార్ ను క్షేత్రస్థాయిలో పరిశీలించి సర్వే చేయాలని ఆదేశిస్తానన్నారు. అంతే కాకుండా దర్గా అభివృద్ధికి పాటుపడతానని, అవసరమైతే ప్రత్యేకమైన నిధులు కేటాయిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. సుడా నిధులతో దర్గా ఆవరణలో మినీ హైమాస్ట్ లైట్లు, కేబుల్ బ్రిడ్జ్ నుంచి దర్గా వరకు లైట్లు ఏర్పాటు విషయమై ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి తో ఫోన్ లో మాట్లాడి తక్షణమే లైట్లు అమర్చేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. తొలిసారిగా దర్గాకు విచ్చేసిన ఎమ్మెల్యే డాక్టర్ సత్యనారాయణకు దర్గా కమిటీ అధ్యక్షుడు మహమ్మద్ వాజిద్ అలీ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో షేర్ అలీ బాబా దర్గా కమిటీ ప్రధాన కార్యదర్శి నదీముద్దీన్, ఉపాధ్యక్షుడు ఎండి.ఇర్ఫాన్ మొహియుద్దీన్, అయూబ్ ఖాన్, సంయుక్త కార్యదర్శుల మీర్జా యూసుఫ్ బేగ్, ఎండి సలీం, కోశాధికారి అలీ, సలహాదారులు మౌలానా అలీముద్దీన్ నిజామి, లయిఖ్ ఎంఏ సలాం, సభ్యులు ఫహీం, ముసా,మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బండారి రమేశ్, 6,7వ డివిజన్ల పార్టీ అధ్యక్షులు తమ్మనవేణి రమేశ్ కుమార్, బండి మల్లేశం, పార్టీ నాయకులు గోపు మల్లారెడ్డి, రామిడి తిరుపతి, వీణవంక రవీందర్, చిందం లింగయ్య, కంది అశోక్ రెడ్డి, కాత కొమురయ్య, కంది రవీందర్,ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.

## 77 ఏళ్లుగా వెలుబడుతున్న ఏకైక జాతీయ వాద పత్రిక...

# గర్వించదగిన తెలుగు వార పత్రిక "జాగృతి".

**• ఒక పత్రిక 10 వేల సైన్యం తో సమానం...**

**• వాదాల పేరుతో వాస్తవాలు మరుగున పడుతున్నాయి..**

**• ఆర్ఎస్ఎస్ ప్రాంత కార్యవాహ కాచం రమేష్ జి...**





**కరీంనగర్,మే21(పీసీడబ్ల్యూ న్యూస్):** 1948 లో ప్రారంభమై 77 ఏళ్ళుగా వెలుబడుతున్న ఏకైక జాతీయవాద పత్రిక, గర్వించదగిన తెలుగు వార పత్రిక జాగృతి అని ఆర్ఎస్ఎస్ తెలంగాణ ప్రాంత కార్యవాహ కాచం రమేష్ జితెలిపారు.రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్ ) శతాబ్ది ఉత్సవాల సందర్భంగా వార పత్రిక జాగృతి పాఠకుల ఆత్మీయ సమ్మేళనము బుధవారం రోజున సాయంత్రం కరీంనగర్ పట్టణంలోని కలెక్టరేట్ ఎదురుగా గల రెవెన్యూ గార్డెన్స్ లో జరిగింది. ఇట్టి ప్రోగ్రాం కు ముఖ్య వక్తగా హాజరైన ఆయన మాట్లాడుతూ తెలుగు పత్రికల చరిత్ర నిస్సందేహంగా ఘనమైందన్నారు. ముఖ్యంగా స్వాతంత్ర ఉద్యమంలో పత్రికలు ప్రముఖ పాత్రను పోషించాయన్నారు. ఆ రోజుల్లో ఆంధ్ర పత్రిక, కృష్ణ పత్రిక, ఇండియన్ ఎక్స్ ప్రెస్, ఆంధ్రప్రభ లాంటి ఎన్నో పత్రికలు ఉండేవని, ఆ తర్వాత ఈనాడు , ఆంధ్రజ్యోతి లాంటి పత్రికలు వచ్చాయన్నారు. నేడు మీడియా రంగం ఎంతో విస్తరించిందన్నారు. డిజిటల్ , సోషల్ మీడియా తో వేగంగా సమాచార వ్యాప్తి జరిగే పరిస్థితులు వచ్చాయన్నారు. ఒక పత్రికపదివేల సైన్యంతో సమానమన్నారు. కానీ నేడు వాదాల పేరుతో వాస్తవాలు మరుగున పడిపోతున్నాయన్నారు. భారతీయత మీద వక్ర భాష్యాల విషపుజల్లులుకురుస్తున్నాయన్నారు. ఏ పత్రిక అయినా సదాశయంతోనే ప్రారంభమవుతుందని, అర్థవంతమైన పేరు , ఆదర్శనీయమైన ప్రయాణం రెండు కన్నులుగా సాగిన పత్రికల జాడ చరిత్ర లో ఒకింత తక్కువేనన్నారు. జాతీయ భావజాలం తో, ధర్మం, రక్షణ కోసం ఈ మట్టి పరిమళంతో వేలుబడుతు, ఎన్నో అటు పోట్లను ఎదుర్కొని 77 ఏళ్లుగా నిలబడిన ఏకైక వార పత్రిక జాగృతి యే నన్నారు. ప్రధానంగా జాతీయతకు సుదూరంగా ఉండే ప్రభుత్వాల ఏలు బడిలో కత్తి సాము చేసిన ఘనత జాగృతి దే న్నారు. జాగృతి ముఖ్యంగా జాతీయ భావాజాలను వ్యాప్తం చేసిందని, ప్రజల అవసరాలను గుర్తించి, ఎన్నో రచనలు చేసి సమాజాన్ని జాగృతం చేసే ప్రయత్నాలు చేసిందన్నారు. గడిచిన ఏడున్నర దశాబ్దాలుగా జాగృతి స్వరాజ్య సమరయోధుల పోరాట ఆశయాన్ని ఆవిష్కరించడానికే శ్రమిస్తుందన్నారు. ఇలాంటి పత్రికను మరింత ప్రజల్లోకి తీసుకు వెళ్లాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ప్రజలతో మమేకమవుతూ సమాజం కోసం పలువిధాల పాటు పడుతుందన్నారు. నేడు దేశంలోని సామాజిక రంగాల్లో ప్రవేశించి, ఒక జాతీయ శక్తిగా సంఘం ఎదిగిందన్నారు. ఇట్టి కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ బాధ్యులు కట్ట రాజగోపాల్, డాక్టర్ చక్రవర్తుల రమణాచారి. దురిశెట్టి నిరంజన చారి , పాక సత్యనారాయణ, ఎలగందుల సత్యనారాయణ, కిషన్ జి, బాలరాజు, తడగోప్పు ల శంకరయ్య, గీకూరి శ్రీనివాస్ , మహేశ్వర్, పుల్లూరి రామారావు, మురళీజీ, పరుశరాం జి తదితరులు పాల్గొన్నారు.



## కర్ణాటక రాష్ట్రంలో ప్రమాదం

### - ఒకే కుటుంబంలోని నలుగురు గద్వాల జిల్లా వాసులు మృతి

**జోగులాంబ మే21(పీసీడబ్ల్యూ న్యూస్):** కర్ణాటక రాష్ట్రం విజయపుర జిల్లా మనగులి సమీపంలో 21.05.25 తెల్లవారు జామున సుమారు 5.00 గంటలప్రాంతంలో కారును ప్రైవేట్,ట్రావెల్స్ బస్సుఢీకొనడంతో సంభవించిన ప్రమాదం ఈఘటనలో కారులో ఉన్న జోగులాంబ గద్వాల జిల్లామల్దకల్, మండలం మల్లెం దొడ్డి గ్రామానికి చెందిన టి.భాస్కర్, ఆయన భార్య పవిత్ర, అభిరామ్, జ్యోత్స్నతో పాటుకారుడ్రైవర్,శివప్ప అక్కడికక్కడేమృతి చెందగా భాస్కర్ పదేళ్ల కొడుకుప్రవీణ్, కుతీవ్రగాయాలు కాగా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తు న్నారు. భాస్కర్,గద్వాలపట్టణంలోని కెనరా బ్యాంకులో విధులు నిర్వహిస్తు వారి కుటుంబసభ్యులతో గద్వాలపట్టణంలోని బీసీ కాలనీలోనివసిస్తున్నారు. మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

## దళితులపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలి

**కాటారం, మే21(పీసీడబ్ల్యూ న్యూస్):**బుధవారం గారేపల్లి పత్రికా విలేకరుల సమావేశంలో తెలంగాణ ప్రజా ఫ్రంట్ జిల్లా అధ్యక్షుడు పీక కిరణ్ మాట్లాడు తూ, మే నెల 12వ తేదీన బుద్ధ పూర్ణిమ రోజు నిర్మల్ జిల్లా ముధోల్ గ్రామంలో ప్రభుత్వ భూమిలో బుద్ధ విగ్రహాన్ని స్థాపించి బుద్ధ జయంతి ఉత్సవాన్ని నిర్వహిస్తున్న, బుద్ధిష్టులైన దళితుల పైన ముధోల్ గ్రామానికి చెందిన కొంతమంది దాడి చేసి దౌర్జన్యం చేసి గాయ పరిచిన వారి పైన ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ సంఘటనపై సమగ్ర విచారణ జరిపి బుద్ధుని అభిమానులు, బుద్ధిస్టులు అయిన దళితులకు ప్రభుత్వము అన్ని విధాల అండదండగా ఉండాలని, వారి కోరిక మేరకు ప్రభుత్వ భూమిలో బుద్ధుని విగ్రహం స్థాపించుటకు వారికి సహకరించాలని ప్రభుత్వాన్ని కోరారు.ముధోల్ గ్రామంలో గ్రామ ప్రజలను రెచ్చగొట్టి, ప్రజల మధ్యన కులమత విభేదాలు సృష్టిస్తున్న అరాచక శక్తుల పైన వెంటనే పోలీస్ యంత్రాంగం సమగ్ర విచారణ జరిపి దళితులపై దాడి చేసిన వారి పైన వెంటనే చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని పీక కిరణ్ కోరారు.

## సిపిఐ మావోయిస్టు కేంద్ర కమిటీ జనరల్ సెక్రెటరీ నంబాల కేశవరావును ఎన్కౌంటర్ పేరుతో చంపేసిన కేంద్ర సర్కార్




**ఆంధ్రప్రదేశ్, మే 21 (పిసిడబ్ల్యూ న్యూస్ ప్రతినిధి):** కగార్ పేరిట దండాకారణ్యం లో జరుగుతున్నా ఎన్కౌంటర్ లన్ని కేంద్రప్రభుత్వం జరుపుతున్న హత్యలే దీన్ని మా పార్టీ సి.పి.ఐ (ఎం.ఎల్) పీపుల్స్ రెసిస్టెన్స్ తీవ్రంగా ఖండిస్తుంది.సి. పి. ఐ (మావోయిస్టు) ప్రధాన కార్యదర్శి కామేడ్ నంబాల కేశ్వారావు అలియాస్ బసవరాజ్ ని అతి హెయంగా కాల్చి చంపడం మనువాద పాలకవర్గాల దుర్మారంగమైన చర్యగా మేము భావిస్తున్నాం.అమితాషా తను మావోయిస్టులను 2026 మార్చ్ లోగ అంతం చేస్తామని ప్రకటించి నప్పుడే పార్టీ ముందు జాగ్రత్తలు తీసుకొని ఉండవలసింది. కామ్రేడ్ సంబాల కేశవరావు తో మరో 30 మందిని పట్టుకొని కాల్చివేసి ఎన్కౌంటర్ కథలు అల్లుతున్నారు.ఉగ్రవాదులు జరిపిన ముస్కార దాడులను ఆపలేని ప్రభుత్వం వారిని పట్టుకోలేని మోడీ అమిత్ షాలు మావోయిస్టులను చాలా సులువుగా పట్టుకొని కాల్చి చంపడంలో కుట్రలు దాగివున్నాయి. వీరినీ ముందుగానే అరెస్టులు చేసి కాల్చి చంపుతున్నారు.ఆర్. ఎస్.ఎస్., తన పాలనను 2047 వరకు కొనసాగించాడానికి మావోయిస్టులను ఆటంకంగా చూపిస్తూ వారిని అంతం చేసి ప్రజలు, బుద్ధి జీవులు నోరేత్తకుండా చేస్తున్న హత్యలుగానే మాపార్టీ పరిగణిస్తుంది. వారి ఎ తరువాత మిగిలిన సి.పి గ్రూపులను నిర్వీర్యం చేయడానికి కుట్రలు పన్నుతుంది ప్రతిపక్షం లేని పాలన చేయడానికే ఇటువంటి మారణ హెూమం సృష్టిస్తుంది. దీన్ని మాపార్టీ తీవ్రంగా ఖండిస్తుంది విప్లవకారులు ముందుగా ఐక్యం కావాలని మావోయిస్ట్ పార్టీతో చర్చలు జరపాలని, మావోయిస్టు పార్టీ, ప్రజాసంఘాలపై ఉన్న నిషేధాన్ని ఎత్తివేయాలని, మావోయిస్టు పార్టీకి విన్నపం ఎత్తుగడాల పంథా మార్చుకొని పార్లమెంటరీని ఎత్తుగడాల రీత్యా ఉపయోగించుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాం విశాల ఐక్యత ఉద్యమం తోనే మన శత్రువుని ఓడించగలమని గుర్తించి విప్లవకారుల ఐక్యతవైపు దృష్టి సారించాలని పిలుపునిస్తున్నాం.లాల్ సీల్ విప్లభివందనాలతో యుగంధర్ దేవ్ ( అధికార ప్రతినిది) సి.పి.ఐ (ఎం.ఎల్) పీపుల్స్ రెసిస్టెన్స్ ప్రొవిజనల్ సెంట్రల్ కమిటీ

## వడ్డే ఓబన్న విగ్రహం ఆవిష్కరించిన

# ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



**రామడుగు,మే 21(పిసిడబ్ల్యూ న్యూస్):**రామడుగు మండలం కేంద్రంలో బుధవారం రోజున ఓబన్న విగ్రహ ఆవిష్కరించినచొప్పదండి నియోజకవర్గం శాసన సభ్యులు మేడిపల్లి సత్యం అనంతరం మాట్లాడుతూవడ్డే ఓబన్న జనవరి 11న రేనాటి ప్రాంతంలో జన్మించారు. ఓబన్న సంచార జాతి వడ్డెర కులానికి చెందిన వారు. బ్రిటీష్ ఈస్ట్ ఇండియా కంపెనీ ఆధీనంలో ఉన్న సమయంలో, రేనాటి పాలేగాళ్లకు కుంఫనీ(కంపెనీ)కి తవర్జీ(అధికారాన్ని కుంఫనీకి ఇచ్చినందుకు పాలెగాళ్లకు ఇచ్చే భత్యం) విషయంలో ప్రారంభమైన ఘర్షణలు, క్రమేపీ సాయుధ పోరాటాలుగా మారాయిఆ పోరాటాల్లో ముఖ్యమైనది, నొస్సం పాలెగాడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి చేసిన సాయుధ పోరు. ఈ భీకర పోరులో, సైన్యాధ్యక్షుడిగా వడ్డే ఓబన్న పోషించిన వీరోచిత పాత్రను, చరిత్రలో తక్కువ చేయడం, అత్యంత దురదృష్టకరం. భయం ఎరుగని వడ్డెర్లు, బోయలు మరియు చెంచులతో కూడిన సంచార తెగల సైన్యాన్ని, సమర్థవంతంగా నడిపించి, దట్టమైన నల్లమల అడవుల్లో సైతం, కుంఫనీ సైన్యాన్ని ఊచకోత కోసి ఉరుకులు పెట్టించడంలో ముఖ్య పాత్ర పోషించిన వీరుడు మన వడ్డే ఓబన్న. నరసింహా రెడ్డికి ముఖ్య అనుచరుడిగా, తన నాయకుడిని మరియు అతని కుటుంబాన్ని కూడా కాపాడటంలో, ముఖ్య పాత్ర పోషించిన వడ్డే ఓబన్న వీరత్వాన్ని తక్కువచేయడాన్ని, ఈ రోజు వడ్డెర జాతి మాత్రమే కాదు, సభ్య సమాజం మొత్తం చాలా సీరియస్ గా తీసుకుందిఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు రామడుగు మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జవ్వాజి హరీష్ రాష్ట్ర మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మరవేని తిరుమల తిరుపతి కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి పంజాల శ్రీనివాస్ గౌడ్ మాజీ సర్పంచ్ కోల రమేష్ గ్రామ శాఖ అధ్యక్షుడు కర్ణ శీను మండల మైనారిటీ సెల్ మొహమ్మద్ అసిఫ్ రామడుగు మండలం కాంగ్రెస్పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ జవ్వాజి అజయ్ ప్రజా ప్రతినిధులు బోదాసు తిరుపతి ఒడ్డరి కులస్తులు తదితరులు పాల్గొన్నారు.






# సత్యాగ్రహి ఆగిపోవడానికి పలు కారణాలు

**• నిర్మాత ఎంఎం రత్నం వెల్లడి**

ప్రస్తుతం పవన్ కల్యాణ్ లైనప్ లో 'ఓజీ', 'ఉస్తాద్ భగత్ సింగ్' లతో పాటు, 'హరిహర వీరమల్లు' సినిమాలున్నాయి. ఇందులో జ్యోతి కృష్ణ దర్శకత్వం వహిస్తున్న 'హరిహర వీరమల్లు' చిత్రం రెండు పార్టులుగా తెరకెక్కుతుంది. కాగా పార్ట్-1 జూన్ 12న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో మేకర్స్ థర్డ్ సింగిల్ అసుర హననం లిరికల్ వీడియో సాంగ్‌ను విడుదల చేశారు. ఒక యోధుడు పైకి వస్తాడు. ఒక వారసత్వం ప్రారంభమవుతుంది. ధర్మం కోసం యుద్ధం ప్రారంభం కానుంది.. అంటూ విడుదల చేసిన ఈ పాట గూస్‌బంప్స్ తెప్పిస్తుంది. ఇందులో భాగంగా ఈ మూవీ నిర్మాత ఏఎమ్ రత్నం మాట్లాడుతూ.. గతంలో పవన్ తో అనుకున్న'సత్యాగ్రహి' సినిమా ఆగిపోవడానికి గల కారణం తెలిపారు. పవన్ కళ్యాన్ కెరీర్ లో చాలా సినిమాలు సెట్స్ మీదకు వెళ్లి ఆగిపోయాయి. అందులో 'సత్యాగ్రహి' కూడా ఒకటి. ఏఎమ్ రత్నం నిర్మాణ సారధ్యంలో ఘనంగా ఈ సినిమా ప్రారంభమైనప్పటి ఏమైందో తెలియదు కానీ అనూహ్యంగా సినిమా ఆగిపోయింది. ఆ తర్వాత మళ్లీ అదే ఏఎమ్ రత్నం తో పవన్ 'బంగారం' సినిమా తీశాడు. అయితే తాజాగా 'హరిహర వీరమల్లు' పాట రిలీజ్ ఈవెంట్ లో ఏఎమ్ రత్నం మాట్లాడుతూ 'నిజానికి సత్యాగ్రహి సినిమాను పవన్ చాలా ఇష్టంగా ప్రారంభించారు. కానీ పలు కారణాల వల్ల క్యాన్సిల్ అయిపోయింది' అని క్లారిటీ ఇచ్చారు రత్నం.



# అవకాశాలు రాకుండా తొక్కేశారు

**• దర్శకుడు త్రివిక్రమ్‌పై పూనమ్ విమర్శలు**

ఒకప్పటి పాపులర్ నటి పూనమ్ కౌర్ ఇటీవల వివాదాలతో వార్తలలో నిలుస్తుండడం మనం చూస్తూ ఉన్నాం. ముఖ్యంగా పవన్ కళ్యాణ్, త్రివిక్రమ్‌లని టార్గెట్ చేస్తూ సోషల్ మీడియాలో ఆసక్తికర కామెంట్స్ చేస్తూ ఉంటుంది. గతంలో త్రివిక్రమ్‌పై పూనమ్ కౌర్ సంచలన కామెంట్స్ చేయగా, ఇప్పుడు దానిపై మరోసారి స్పందించి వార్తలలో నిలిచింది .నేను గతంలో చెప్పాను, ఇప్పుడు కూడా చెబుతున్నాను. మెయిల్ ద్వారా కంప్లైంట్ చేశాను. ఝాన్సీ గారితో మాట్లాడాను, కాని తర్వాత ఆమెని కలవలేకపోయిను. ఆమె బిజీగా ఉన్నారని, డిస్టర్బ్ చేయొద్దని చెప్పారు. అందుకే కలవలేకపోయాను. నేను త్రివిక్రమ్ శ్రీనివాస్ మీద కంప్లైంట్ చేశాను. రాజకీయ అండదండలతో ఎవరైతే తప్పించుకుంటున్నారో అతడి మీద ఫిర్యాదు చేశాను.. మెయిల్ చేసినట్టుగానే ఉమెన్ టీంతో నేను మాట్లాడతాను.. థాంక్యూ అని పూనమ్ పోస్ట్ వేసింది. తన వద్ద ఆధారాలు ఉన్నాయంటూ ఝాన్సీతో చాట్ చేసిన స్క్రీన్ షాట్లను కూడా ఆమె బయటపెట్టారు. ఈ క్రమంలో మరోసారి వీరి వ్యవహారం హాట్ టాపిక్‌గా మారింది. ఇటీవల ఏపీ సీఎం చంద్రబాబుని పూనమ్ కలవగా, అందుకు సంబంధించిన ఫొటో నెట్టింట వైరల్ అయింది. ఆ ఫొటో చూసి త్రివిక్రమ్‌తో సమస్య సమసిపోయిందని , అందుకే కూటమి ప్రభుత్వంలో పవన్ ఉన్నా కూడా చంద్రబాబుని కలిసింది అని అంతా అనుకున్నారు. కాని ఇప్పుడు ఆమె పోస్ట్‌లు చర్చనీయాంశంగా మారాయి. మలయాళ ఇండస్ట్రీ, మీటూ ఆరోపణలు వెల్లువెత్తుతున్న టైంలోనే పూనమ్ కౌర్ మాటల మాంత్రికుడు త్రివిక్రమ్‌పై సంచలన ఆరోపణలు చేశారు. సినిమా అవకాశాల పేరుతో తనను ఛీట్ చేశారని.. ఇండస్ట్రీలో ఎదగకుండా తొక్కేశారని పూనమ్ పెద్ద ఎత్తునే విమర్శలు చేసింది. మాలో కూడా ఈ విషయంపై ఫిర్యాదు చేసినట్టు పేర్కొన్నారు. అయితే దానిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. రాజకీయంగా తనని ఇబ్బందికి గురి చేశారని, అందుకే అప్పట్లో వదిలేశానని చెప్పింది.

# అనుష్క ఘాటీకి వరుస అవాంతరాలు

## విడుదల ప్లాన్ జూలైకి వాయిదా

టాలీవుడ్ స్టార్ హీరోయిన్ అనుష్క ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'ఘాటీ'. క్రిష్ జాగర్లమూడి దర్శకత్వం వహించిన ఈ మూవీలో తమిళ హీరో విక్రమ్ ప్రభు కీలక పాత్ర పోషిస్తుండగా. ఈ చిత్రాన్ని యువి క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్టెయిన్మెంట్స్ సంయుక్తంగా ప్రొడ్యూస్ చేస్తున్నాయి. ఇక ఇప్పటి వరకు అనుష్కను జేజమ్మ, దేవసేన వంటి పవర్ ఫుల్ రోల్స్ చూసినప్పటికి.. మొట్టమెదటి సారిగా ఆమెను వయలెంట్ రోల్‌లో చూపించే క్రెడిట్ క్రిష్ జాగర్లమూడికి దక్కింది. దీంతో అనుష్కని తెరపై ఎప్పుడు చూస్తామా.. అని అభిమానులు వేయికళ్లతో ఎదురుచూస్తున్నారు. అయితే తాజాగా ఈ మూవీ రిలీజ్ డేట్ పై..వార్తలు వినపడుతున్నాయి. మొదట ఏప్రిల్ 18న ఈ మూవీ రిలీజ్ చేయాలని దర్శక నిర్మాతలు ప్లాన్ చేసినప్పటికి, కొన్ని అనివార్య కారణాల వల్ల సినిమా విడుదల వాయిదా పడింది. ఇప్పుడు ఈ సినిమాను జూలై రెండో వారంలో తీసుకు రావాలని ప్లాన్ చేస్తున్నారట. కానీ జూన్‌లో రిలీజ్ డేట్స్ ఖాళీ లేవు. మొదటి వారం కమల్ హాసన్ 'థగ్ లైఫ్', రెండో వారం పవన్ కళ్యాణ్ 'హరిహర వీరమల్లు', మూడో వారం ధనుష్ 'కుబేర', నాలుగో వారం విష్ణు మంచు 'కన్నప్ప' వంటి వరుస పాన్ ఇండియా సినిమాలు లైన్ లో ఉన్నాయి. జూలై మొదటి వారంలో విజయ్ దేవరకొండ 'కింగ్‌డమ్' రిలీజ్ కు రెడీ అయింది. అంటే జూలై రెండవ వరం స్లాట్ ఖాళీగా ఉందన్నమాట. అందుకే అప్పుడు విడుదల చేయాలని ప్లాన్ చేశారట. మరి జూలై రెండో వారంలో



అయిన 'ఘాటీ' కి సోలో రిలీజ్ దక్కే అవకాశం ఉందంటారా..?

# జూన్ 5న కమలహాసన్ థగ్‌లైఫ్ విడుదల

**- ఆగస్ట్‌లో ఓటిటిలోకి అంటూ అప్పడే ప్రచారం**

కమల్ హాసన్ నటించిన తాజా చిత్రం 'థగ్ లైఫ్'. లెజెండరీ డైరెక్టర్ మణిరత్నం కాంపౌండ్ నుంచి వస్తోన్న ఈ మూవీలో కోలీవుడ్ స్టార్ హీరో శింబు కీలక పాత్రలో నటిస్తుండగా.. ఐశ్వర్యలక్ష్మి, త్రిష, గౌతమ్ కార్తీక్, జోజు జార్జ్, దుల్కర్ సల్మాన్, జయం రవి ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. కమల్ హీరో మాత్రమే కాదు నిర్మాత కూడా. ప్రొడక్షన్ హౌస్ రాజ్ కమల్ ఇంటర్నేషనల్ ఫిల్మ్స్, దర్శకుడు మణిరత్నానికి చెందిన మద్రాస్ టాకీస్, ఉదయనిధి స్టాలిన్‌కు రెడ్ఫ జెయింట్ ఫిలింస్ మీద సినిమా రూపొందింది. ఇక..ఇటీవల విడుదలైన ట్రైలర్‌కు మంచి స్పందన రాగా. ఈ చిత్రం జూన్ 5న పాన్ ఇండియా స్థాయిలో గ్రాండ్‌గా విడుదల కానుంది. అయితే ఈ సినిమా డిజిటల్ స్ట్రీమింగ్ డేట్ గురించి కమల్ హాసన్ క్లారిటీ ఇచ్చారు. రీసెంట్ గా ఓ మీడియాతో ముచ్చటించగా.. ఓటీటీలోకి ఎప్పుడు వస్తుంది? అంటే.. 'ఆగస్టు వరకు వెయిట్ చేయాలి. థియేటర్లలో విడుదలైన ఎనిమిది వారాల తర్వాత మాత్రమే మా సినిమా ఓటీటీ లోకి వస్తుంది' అని కమల్ హాసన్ స్పష్టం చేశారు. కాగా ఈ 'థగ్ లైఫ్' ఓటీటీ హక్కులను ఇంటర్నేషనల్ ఎ÷-లాట్‌ఫార్మ్ నెట్‌ఫ్లిక్స్ సొంతం చేసుకోగా. తమిళం తో పాటు తెలుగు, హిందీ, మలయాళ, కన్నడ భాషల్లో స్ట్రీమింగ్ చేయనున్నారట.






# మోహన్‌లాల్‌కు బర్త్‌డే కానుక

**• కన్నప్ప నుంచి పోస్టర్ విడుదల**

మలయాళంలో వరుసగా బ్లాక్ బస్టర్ హిట్లను అందుకుంటున్నారు సూపర్ స్టార్ మోహన్ లాల్. ఆయన నటిస్తున్న చిత్రాలన్నీ కూడా వరుసగా 200 కోట్ల వసూళ్లతో అదరగొడుతున్నాయి. ఇక త్వరలోనే మంచు విష్ణు డ్రీమ్ ప్రాజెక్ట్ 'కన్నప్ప' తో ఆడియన్స్ ముందుకు రానున్నారు మోహన్ లాల్. 'కన్నప్ప' నుంచి వస్తున్న ప్రతి అప్డేట్ సోషల్ మీడియాలో ట్రెండింగ్ అవుతున్న సంగతి తెలిసిందే. క్యారెక్టర్ పోస్టర్‌లు, టీజర్, పాటలు ఇలా అన్నీ కూడా ఆడియెన్స్‌ను ఆకట్టుకున్నాయి. అయితే జూన్ 27న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్ రిలీజ్‌కు సిద్ధమవుతున్న ఈ చిత్రం నుంచి తజాగా అందరినీ ఆకట్టుకునే అప్డేట్‌ను వదిలారు. ఈ రోజు మోహన్ లాల్ పుట్టిన రోజు (మే 21) సందర్భంగా కన్నప్ప నుంచి గ్లింప్స్‌ను రిలీజ్ చేశారు.ఈ వీడియోలో మోహన్ లాల్ స్క్రీన్ ప్రెజెన్స్, కనిపించిన తీరు అన్నీ అద్భుతంగా ఉన్నాయి. గూస్ బంప్స్ తెప్పించేలా ఈ గ్లింప్స్‌ను కట్ చేశారు. దీని బట్టి చూస్తే, కిరాత పాత్రలో మోహన్‌లాల్ ప్రెజెన్స్, యాక్టింగ్ అందరినీ ఆకట్టుకోవడం కాయం. ఈ చిత్రంతో మళ్లీ ఆడియెన్స్‌పై తన ముద్రను వేసేలా కనిపిస్తున్నారు. దైవిక శక్తితో ముడిపడి ఉన్న కిరాత అనే పాత్రను మోహన్‌లాల్ పోషించారు. ప్రస్తుతం విష్ణు మంచు, కన్నప్ప టీం ప్రమోషన్స్‌లో ఫుల్ బిజీగా ఉండగా, ఇప్పటికే యూఎస్ టూర్‌ను పూర్తి చేశారు.

# హరిహర వీరమల్లు నుంచి మరో పాట




**• అసుర హననం అంటూ..**

**పవర్‌ఫుల్ సాంగ్**

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ నటించిన లాంగ్ అవైటెడ్ చిత్రం 'హరిహర వీరమల్లు'. నిజ జీవిత యోధుడు వీరమల్లు జీవిత కథ ఆధారంగా దర్శకుడు క్రిష్ జాగర్లమూడి, సహా జ్యోతి కృష్ణ తెరకెక్కించిన ఈ చిత్రం కోసం, రెండు తెలుగు రాష్ట్రాల ప్రేక్షకులు.. ఎంతో ఆత్రుతగా ఎదురు చూస్తున్నారు. ఇప్పుడు విడుదలకు సిద్ధం అవుతుండగా మేకర్స్ సాలిడ్ ప్రమోషన్స్ ఆల్రెడీ స్టార్ట్ చేశారు. ఇప్పటికే రెండు పాటలు విశేషంగా ఆకట్టుకోగా తాజాగా మూడో పాట విడుదల చేశారు.అసుర హననం అంటూ సాగిన ఈ సాంగ్ అనుకున్నట్టుగానే మంచి పవర్ ఫుల్ గా ఉందని చెప్పాలి. కీరవాణి ఇచ్చిన ట్యూన్ సహా రాంబాబు గోసల సాహిత్యం స్టన్నింగ్‌గా ఉన్నాయని చెప్పవచ్చు. మొత్తం ప్లే బ్యాక్ సింగర్స్ తోనే పాడించిన, ఈ పాట వింటుంటే ఒళ్ళు నిక్కబొడుచుకుంటుంది. అంతే కాదు ఈ లిరికల్ వీడియోలో విజువల్స్ కూడా బాగున్నాయి. పవన్ పై పలు పోరాట సన్నివేశాల దృశ్యాలు ఒక్కొక్కటి గూస్ బంప్స్ తెప్పిస్తున్నాయి. మొత్తానికి రెండు సింపుల్ సాంగ్స్ తర్వాత మంచి పవర్ సాంగ్‌ని మేకర్స్ ఇపుడు విడుదల చేసారు. ఇక ఈ చిత్రం ఈ జూన్ 13న పాన్ ఇండియా భాషల్లో సినిమా విడుదల కాబోతుంది.